



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 63 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 21-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

వైష్ణవి కన్నీరు చూసిన అన్న హృదయం,
ఆవేదనతో అగ్నిలా మండింది..
హరిబాబు ప్రవర్తన పై పెరిగిన కోపం,
చివరికి కక్షగా మారింది...
చెల్లెలి కన్నీటికి న్యాయం
చేయాలనుకున్నాడు,
కానీ ప్రతి కారం దారిలో నడిచాడు...
"ప్రాణానికి ప్రాణమే"అన్న క్షణంలో,
ఒక ప్రాణం శాశ్వతంగా ఆగిపోయింది...
ఒక ఇంటి బాధకు
మరో ఇంటి కన్నీరు సమాధానమా?
కక్షతో గెలిచేది ఎవరు కాదు,
ఓడిపోయేది మాత్రం మానవత్వమే !
తప్పుకు శిక్ష చట్టం ఇవ్వాలి,
కోపానికి ప్రాణం బలి కావద్దు !
కక్షను ఆపుదాం-హింసను విడిచేద్దాం!
మనిషి ప్రాణానికి విలువ ఇద్దాం!
కక్ష కాదు, కరుణ కావాలి..
హింస కాదు, మానవత్వం కావాలి..
ప్రతీకారం కాదు, పరిష్కారం కావాలి..
మనిషిని మనిషి కాపాడే
మంచి సమాజం కావాలి....

రమేష్ గాండ్ల వర్ధన్నపేట



# ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- 69 అడుగుల శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిని దర్శించుకునేందుకు భారీగా భక్తుల రాక
- వీకెండ్ కావడంతో 2 కిలోమీటర్ల మేర బారులు తీరిన భక్తులు
- మహాగణపతి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం
- శనివారం ఒక్కరోజే 2 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ వెల్లడి
- తొక్కిసలాటకు అవకాశం లేకుండా భారీ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలతో నిఘా

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** హైదరాబాద్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. నగరంలోని గల్లీగల్లీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలు భక్తులను ఆకట్టుకుంటుండగా.. ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ ఏడాది కొలువుదీరిన 69 అడుగుల శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిని దర్శించుకునేందుకు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు పోటెత్తారు.

**2 కిలోమీటర్ల మేర భక్తుల క్యూ**

వీకెండ్ కావడంతో ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 2 కిలోమీటర్ల మేర భక్తులు క్యూలో నిల్చున్నారు. దీంతో స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాటకు అవకాశం లేకుండా క్రమపద్ధతిలో భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు.

**ఒక్కరోజే లక్షన్నరకు పైగా భక్తులు వచ్చే అవకాశం**

ఆదివారం సెలవు కావడంతో ఒక్కరోజే లక్షన్నరకు పైగా భక్తులు బడా గణేష్‌ను దర్శించుకునే అవకాశం ఉందని ఉత్సవ కమిటీ

మిగతా 2లో





# దానం నాగేందర్‌కు ఉపఎన్నికలు కలిసి రావు

- ఖైరతాబాద్‌లో బీజేపీదే గెలుపు: రఘునందన్‌రావు
- దానం నాగేందర్‌కు ఉపఎన్నికల్లో మరోసారి ఓటమి తప్పదని వ్యాఖ్య
- అధికారంలో ఉన్న పార్టీ వైపు మారడమే ఆయన రాజకీయ విధానమంటూ విమర్శ
- ఖైరతాబాద్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ధీమా
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం నాగేందర్
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై రఘునందన్‌రావు తీవ్ర విమర్శలు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసిన నేపథ్యంలో బీజేపీ మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక జరిగితే దానం నాగేందర్‌కు మరోసారి ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**దానం రాజకీయ విధానంపై విమర్శలు**

హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన రఘునందన్‌రావు.. దానం నాగేందర్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారారని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో

మిగతా 2లో

# మూడేళ్ల చిన్నారిని ఢీకొట్టి పరారైన కారు

- సంతోష్‌నగర్ ఐఎస్ సదన్ ఎక్స్‌రోడ్డులో విషాద ఘటన
- హోటల్ నుంచి బయటకు వస్తుండగా చిన్నారిని ఢీకొట్టిన కారు
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి
- సీసీటీవీ కెమెరాల్లో రికార్డైన ప్రమాద దృశ్యాలు
- కారు, డ్రైవర్ కోసం ప్రత్యేక బృందాలతో పోలీసుల గాలింపు

2లో





# హైదరాబాద్‌లో పైప్‌లైన్ లీకేజీ పలు ప్రాంతాలకు తాగునీటి కష్టాలు

- పైప్‌లైన్ లీకేజీతో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం
- యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన జలమండలి అధికారులు
- మరమ్మతులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి
- మరమ్మతులు పూర్తయ్యాక దశల వారీగా నీటి సరఫరా పునరుద్ధరణ
- ప్రభావిత ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** పైప్‌లైన్ లీకేజీ కారణంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మరమ్మతు పనులను పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓ అండ్ ఎం, ట్రాన్స్‌మిషన్ విభాగాల అధికారులు సమన్వయంతో మరమ్మతులు చేపడుతున్నారు.

**పలు ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు**

ఆర్సీ పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి



ప్రాంతాల్లో నీటి సరఫరా ప్రభావితమైంది. చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్ ప్రాంతాల్లోనూ ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బీరంగూడ, అమీన్‌పూర్, భాగ్యనగర్ కాలనీ, ఎర్రగడ్డ ప్రాంతాల్లోనూ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**కూకట్‌పల్లి, అమీర్‌పేట్ ప్రాంతాలపై ప్రభావం**

ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, ప్రగతినగర్ ప్రాంతాల్లోనూ తాగునీటి సరఫరాపై లీకేజీ ప్రభావం పడింది.

**దశలవారీగా సరఫరా పునరుద్ధరణ**

మరమ్మతులు పూర్తయిన వెంటనే దశలవారీగా తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని జలమండలి అధికారులు తెలిపారు. అప్పటివరకు ప్రభావిత ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

# టిమ్స్ ఆసుపత్రిలో భారీ చోరీ

- 288 వైద్య పరికరాలు మాయం
- ఐదో అంతస్తు స్టోరేజ్ రూమ్ తాళాలు పగలగొట్టి చోరీ
- 12 ఐవోఎస్ బాక్సులు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని దుండగులు
- ఒక్కో బాక్సులో 24 పరికరాలు.. మొత్తం 288 పరికరాలు మాయం
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న బోరబండ పోలీసులు
- ఇటీవలే ప్రారంభమైన ఆసుపత్రిలో చోరీతో భద్రతపై అనుమానాలు




# పోచారం ఐటీ కారిడార్‌లో విషాదం..

# బ్యాంక్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

- బ్యాంక్ ఉద్యోగిని అనుమానాస్పద మృతి
- గెలాక్సీ టవర్స్‌లో 28 ఏళ్ల మౌనిక మృతి
- ప్రైవేట్ బ్యాంకులో హెచ్ ఆర్ విభాగంలో ఉద్యోగం
- భర్తతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డ మౌనిక
- కవల పిల్లలను వదిలి కన్ను మూయడంతో కుటుంబంలో విషాదం
- మృతికి కారణాలపై పోలీసుల దర్యాప్తు

**పోచారం, ప్రజా వాయిస్:** పోచారం ఐటీ కారిడార్ పరిధిలోని గెలాక్సీ టవర్స్‌లో 28 ఏళ్ల మౌనిక సంతోషి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ఆమె ఓ ప్రైవేట్ బ్యాంకులో మానవ వనరుల విభాగంలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. మౌనిక మృతితో



కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి నివాసితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

**ప్రేమ వివాహం.. హైదరాబాద్‌లో స్థిర నివాసం**

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన మౌనిక చిన్నప్పటి నుంచే కష్టపడి చదివి ఉద్యోగం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో వైజాగ్‌కు చెందిన రమాకాంత్‌తో పరిచయం ఏర్పడి, అనంతరం ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

**కవల పిల్లలతో కుటుంబ జీవితం**

మౌనిక, రమాకాంత్ దంపతులకు కవల పిల్లలు ఉన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు తల్లిగా, భార్యగా కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ జీవితం కొనసాగించారు. అయితే అనూహ్యంగా మౌనిక మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

**పోస్ట్‌మార్టం కోసం మృతదేహం తరలింపు**

మౌనిక మృతదేహాన్ని గెలాక్సీ టవర్స్‌లో గుర్తించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు**

మౌనిక మృతికి అసలు కారణం ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మృతికి గల కారణాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# నేను ఎవరి బాణాన్ని కాదు.. బహుజనుల బాణాన్ని: కవిత

- బీఆర్ఎస్ బాణం, కాంగ్రెస్ బాణం అంటూ చేస్తున్న విమర్శలపై కవిత ఘాటు వ్యాఖ్యలు
- బహుజనుల హక్కుల కోసం మోదీ, రేవంత్ రెడ్డి, కేసీఆర్ తోనైనా పోరాడుతానని ప్రకటన
- అవకాశం ఇస్తే తల్లిలా ఆలోచించి పాలన సాగిస్తానని వ్యాఖ్య
- వచ్చే ఎన్నికల్లో గెలిచి తాను ముఖ్యమంత్రి అవుతానని ధీమా
- కాంగ్రెస్ ను గద్దె దించి బహుజన రాజ్యం తీసుకురావాలని పిలుపు

2లో



# మహిళల భద్రత.. మాదక ద్రవ్యాలపై అవగాహన

- చెంగిచెర్ల శ్రీనివాస్‌నగర్ కాలనీలో మెడిపల్లి పోలీసుల అవగాహన కార్యక్రమం
- మహిళల భద్రత, రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన
- యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ జలేందర్‌రెడ్డి సూచన
- చెడు మార్గాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సందేశం.



**చెంగిచెర్ల, ప్రజా వాయిస్:** గణేష్ సురక్షా సంకల్ప్–2026లో భాగంగా మెడిపల్లి పోలీసులు చెంగిచెర్ల శ్రీనివాస్‌నగర్ కాలనీలో మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు.

### మహిళల భద్రతపై అవగాహన

కార్యక్రమంలో సీఐ జలేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, బాలికల విషయంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు.

### మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులై చెడు మార్గాల్లోకి వెళ్లకూడదని సీఐ జలేందర్‌రెడ్డి సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత తమ భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### రహదారి భద్రతపై సూచనలు

వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రజల సహకారంతో సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో రెండు ఏటీఎంలలో దొంగల బీభత్సం

- రూ.16 లక్షలు చోరీ
- రాజీవ్ రహదారిపై రెండు ఏటీఎంలను ధ్వంసం చేసిన దుండగులు
- గ్యాస్ కట్టర్లతో యంత్రాలను పగులగొట్టి నగదు అపహరణ
- సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టి చోరీ
- మహిళ వేషధారణలో ఒకరు
- ముగ్గురు దుండగులుగా పోలీసుల అనుమానం
- నాలుగు ప్రత్యేక బృందాలతో కొనసాగుతున్న దర్యాప్తు



**కరీంనగర్, ప్రజా వాయిస్:** కరీంనగర్ నగరానికి సమీపంలోని రాజీవ్ రహదారిపై రెండు ఎస్‌బీఐ ఏటీఎంలను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున తిమ్మాపూర్ స్టేజీ, దుర్శేడు స్టేజీ వద్ద ఉన్న ఏటీఎంలను ధ్వంసం చేసి నగదు అపహరించారు. మొత్తం రూ.16 లక్షల వరకు చోరీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

### ఏడు నిమిషాల్లోనే చోరీ

తెల్లవారుజామున 2.40 నుంచి 3 గంటల మధ్య తిమ్మాపూర్ స్టేజీ వద్ద ఉన్న ఏటీఎం వద్దకు దుండగులు చేరుకున్నారు. సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టి, ఏటీఎంలోని నాలుగు ట్రేలలో ఉన్న రూ.7,19,400 నగదును అపహరించారు. అనంతరం సుమారు 16 కిలోమీటర్ల దూరంలోని దుర్శేడు స్టేజీకి చేరుకుని మరో ఏటీఎం కింది భాగాన్ని గ్యాస్ కట్టర్లతో ధ్వంసం చేసి సుమారు రూ.8.55 లక్షల నగదు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక్కో ఏటీఎం వద్ద కేవలం ఏడు నిమిషాల్లోనే చోరీ పూర్తి చేసినట్లు వెల్లడించారు.

### మహిళ వేషధారణలో ఒకరు

దుర్శేడు ఏటీఎం వద్ద దుండగులు ప్రయాణించిన ఎంహెచ్ 03 ఈబీ 4258 నంబరు స్కార్పియో వాహనం సీసీ కెమెరాల్లో నమోదైంది. మొత్తం ముగ్గురు దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిలో ఒకరు ముఖానికి మాస్కు ధరించి మహిళ వేషధారణలో ఉన్నట్లు గుర్తించారు. తమ కదలికలు రికార్డు కాకుండా ఏటీఎం లోపల, వెలుపల ఉన్న కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టారు.

### అంతర్రాష్ట్ర ముఠాపై అనుమానం

రెండు ఏటీఎంల వద్ద చోరీ జరిగిన తీరును పరిశీలిస్తే ముందుగానే రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళికతో నేరానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. అనుభవం ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ప్రమేయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చోరీ అనంతరం దుండగులు పెద్దపల్లి వైపు పరారైనట్లు పోలీసులు గుర్తించారు.

### నాలుగు బృందాలతో దర్యాప్తు

దుర్శేడు ఏటీఎం వద్ద చోరీ జరుగుతున్న సమయంలో తెల్లవారుజామున 3.40 గంటలకు ఢిల్లీలోని ఏటీఎం నియంత్రణ కేంద్రానికి సమాచారం వెళ్లింది. బ్యాంకు అధికారులకు అందిన సూచనల మేరకు ఉదయం 4 గంటలకు

# నేను ఎవరి బాణాన్ని కాదు.. బహుజనుల బాణాన్ని: కవిత

**కొడంగల్, ప్రజా వాయిస్:** తనను బీఆర్ఎస్ వదిలిన బాణమని కొందరు, కాంగ్రెస్ బాణమని మరికొందరు చేస్తున్న విమర్శలపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఘాటుగా స్పందించారు. తాను ఎవరో వదిలిన బాణాన్ని కాదని.. దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని స్ప ష్టం చేశారు. బహుజనుల హక్కుల కోసం ప్రధా ని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌తోనైనా పోరాడేందుకు సిద్ధమని ప్రకటించారు.


### మాతృస్వామ్యం రావాలి

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కవిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే రేవంత్‌రెడ్డి, కేసీఆర్, మోదీలతో పోరాడి చూపిస్తానన్నారు. ఎవరి మద్దతు లేకుండా ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని చెప్పారు. ఇన్నాళ్లూ అయ్యల పాలనలో ప్రజల బతుకులు మారలేదని.. ఇక తెలంగాణలో మాతృస్వామ్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.

### వంత్ ప్రభుత్వంపై విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు కూడా డబ్బులు అడుగుతున్నారని కవిత ఆరోపించారు. ఎన్నో గ్రామాలకు ఇప్పటికీ నీళ్లు రావడం లేదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గట్టు, కేటిదొడ్డి మండలాల్లో అక్షరాస్యత పరిస్థితిపై సీఎం సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శలు గుప్పించారు.

# టిమ్స్ ఆసుపత్రిలో భారీ చోరీ




**హైదరాబాద్, ప్రజా వాయిస్:** సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రిలో భారీ చోరీ జరిగింది. అకడమిక్ బ్లాక్‌లోని ఐదో అంతస్తు స్టోరేజ్ రూమ్ తాళాలు పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు 12 ఐవోఎస్ బాక్సులను ఎత్తుకెళ్లారు. ఒక్కో బాక్సులో 24 పరికరాలు ఉండటంతో మొత్తం 288 వైద్య పరికరాలు చోరీకి గురైనట్లు అధికారులు గుర్తించారు.

### స్టోరేజ్ రూమ్ తాళాలు పగలగొట్టి..

ఆసుపత్రి అకడమిక్ బ్లాక్‌లోని ఐదో అంతస్తులో ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ఐవోఎస్ పరికరాలను స్టోరేజ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ నెల 13న ఉదయం 7.30 నుంచి 8 గంటల మధ్య దుండగులు గది తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు ఆసుపత్రి వర్గాలు గుర్తించాయి. అనంతరం 12 బాక్సులను అపహరించారు.

### సీసీటీవీ ఫుటేజీతో దర్యాప్తు..

చోరీని గుర్తించిన సైట్ ఇంజనీర్ ఎన్. నాగ సాయివంశీ కృష్ణ వెంటనే బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దుండగులు ఐదో అంతస్తు వరకు ఎలా చేరుకున్నారు? ఆసుపత్రి గదుల అమరికపై వారికి ముందస్తు సమాచారం ఉందా? అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఆసుపత్రి పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

### అంతర్గత వ్యక్తుల ప్రమేయంపైనా ఆరా

చోరీలో ఆసుపత్రికి సంబంధించిన వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పక్కా సమాచారంతోనే స్టోరేజ్ రూమ్‌ను లక్ష్యంగా చేసుకున్నారా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

### ఇటీవలే ప్రారంభమైన టిమ్స్‌లో చోరీ

సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని 2026 ఆగస్టు 17న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్డియాక్, రీనల్, ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్, ట్రామా, ఐసీయూ వంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలే ప్రారంభమైన అత్యాధునిక ఆసుపత్రిలోనే భారీగా వైద్య పరికరాలు చోరీకి గురికావడం కలకలం రేపుతోంది. ఆసుపత్రి భద్రతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# దానం నాగేందర్‌కు ఉపఎన్నికలు కలిసి రావు

**మొదటి పేజీ తరువాయి**

ఉంటే ఆ పార్టీ వైపు వెళ్లడం దానం నాగేందర్‌కు రాజకీయ విధానంగా మారిందని విమర్శించారు.

### హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. పార్టీ మార్పుపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించి.. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని తీర్పులో పేర్కొంది.

### సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికపై తదుపరి పరిణామాలు న్యాయపరమైన ప్రక్రియపైనే ఆధారపడి ఉన్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం అధికారికంగా ఉపఎన్నిక షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది.

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై రఘునందన్‌రావు విమర్శలు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పైనా రఘునందన్‌రావు విమర్శలు చేశారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ఇరు పార్టీలు రాజకీయ అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆరోపించారు. ఎంఐఎంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపైనా ఆయన విమర్శలు గుప్పించారు.

# మూడేళ్ల చిన్నారిని ఢీకొట్టి పరారైన కారు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** పాతబస్తీలోని సంతోష్‌నగర్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఐఎస్ సదన్ ఎక్స్‌రోడ్డులో ఓ మూడేళ్ల చిన్నారిని కారు ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలైన బాలుడిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### హోటల్ నుంచి బయటకు వస్తుండగా ప్రమాదం

సంతోష్‌నగర్ పరిధిలోని ఐఎస్ సదన్ ఎక్స్‌రోడ్డులో ఉన్న స్వీకార్ హోటల్ నుంచి మొహియుద్దీన్ పార్సెల్ తీసుకునేందుకు వెళ్లాడు. ఆయన వెంట మూడేళ్ల కుమారుడు ఇజ్హాన్ ఉద్దీన్ కూడా ఉన్నాడు. పార్సెల్ తీసుకుని హోటల్ నుంచి బయటకు వస్తుండగా వేగంగా వచ్చిన కారు బాలుడిని బలంగా ఢీకొట్టింది.

### ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది

ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వాహనంతో అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని తండ్రి వెంటనే సమీపంలోని షాలిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

### సీసీటీవీలో ప్రమాద దృశ్యాలు

సమాచారం అందుకున్న సంతోష్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హిట్ అండ్ రన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి.

### డ్రైవర్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కారును, డ్రైవర్‌ను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల తో గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు తమ కుమారుడి మృతికి కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఫోన్‌పే డబ్బుల కోసం స్నేహితుడి దారుణ హత్య

- సదాశివపేట మండలం అంకెనపల్లిలో దారుణ ఘటన
- ఫోన్‌పేలో వచ్చిన డబ్బులు ఇవ్వలేదని స్నేహితుడితో గొడవ
- ఆగ్రహంతో కత్తితో గొంతు కోసిన నిందితుడు
- తీవ్ర గాయాలతో రాహుల్ అక్కడికక్కడే మృతి
- పరారీలో ఉన్న నీరజ్ కోసం పోలీసుల గాలింపు



**సదాశివపేట, ప్రజా వాయిస్:** చిన్నపాటి డబ్బు వివాదం స్నేహితుడి హత్యకు దారితీసింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం అంకెనపల్లిలో ఫోన్‌పే ద్వారా వచ్చిన డబ్బుల కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవ హత్యకు దారితీసింది. శనివారం ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదుట జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

### డబ్బుల విషయంలో గొడవ

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాహుల్, నీరజ్ అంకెనపల్లిలోని ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తూ ఒకే గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలో నీరజ్ కుటుంబ సభ్యులు రాహుల్ ఫోన్‌పే ఖాతాకు కొంత డబ్బు పంపించారు. ఆ డబ్బును తనకు ఇవ్వాలని నీరజ్ రాహుల్‌ను అడిగాడు. అయితే తన మొబైల్ మరమ్మతులో ఉందని.. ప్రస్తుతం డబ్బులు తీసి ఇవ్వలేనని రాహుల్ చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది.

### కత్తితో గొంతు కోసిన నిందితుడు

డబ్బులు ఇవ్వాలని నీరజ్ పదేపదే నిలదీయడంతో వివాదం తీవ్రంగా మారింది. ఆగ్రహానికి గురైన నీరజ్ గదిలో ఉన్న కత్తిని తీసుకుని రాహుల్‌పై దాడి చేశాడు. గొంతుకు తీవ్ర గాయం కావడంతో రాహుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నీరజ్ అక్కడి నుంచి పరారయ్యాడు.

### ఆధారాలు సేకరించిన పోలీసులు

సమాచారం అందుకున్న సదాశివపేట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### నిందితుడి కోసం గాలింపు

హత్య అనంతరం పరారైన నీరజ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చిన్న మొత్తంలో డబ్బు విషయంలో స్నేహితుడిని హత్య చేయడం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఖైరతాబాద్ బడా గణేష్ దర్శనానికి పోటెత్తిన భక్తులు



**మొదటి పేజీ తరువాయి**

, అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం ఒక్కరోజే 2 లక్షల మందికి పైగా భక్తులు ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

### ఎండలతో భక్తులకు ఇబ్బందులు

ఎండల తీవ్రత కారణంగా శనివారం కొంతమంది భక్తులు క్యూలైన్లలోనే సొమ్మసిల్లి పడిపోయారు. అక్కడే అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందిం చారు. మరికొందరు రద్దీ, జనం ఒత్తిడితో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు వారికి సహకరించారు.

### మెట్రో, ఎంఎంటీఎస్, బస్సుల్లో భారీగా రాక

చాలామంది భక్తులు మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు, ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ఖైరతాబాద్‌కు వస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ నుంచి గణేష్ మండపం వైపు వెళ్లే మార్గంలో రద్దీ అధికంగా ఉందన్నారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ప్రత్యేక ఆకర్షణగా పంచముఖ గణపతి

ఈ ఏడాది ఖైరతాబాద్‌లో 69 అడుగుల ఎత్తులో శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి కొలువు దీరారు. బడా గణేష్‌తో పాటు కాళికామాత, సోమ నాథ్ జ్యోతిర్లింగం, విశ్వకర్మ, విష్ణుమూర్తి రూపా లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఊరుకోం

- కౌన్సిల్ ఎజెండా అంతా కమిషన్ల కోసమే
- రూ.30 లక్షలతో 'రూపాయి అంత్యక్రియలు' ప్రారంభించాలి
- సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ఆగ్రహం




**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, పాలకుల నిరంకుశ వైఖరిపై పోరాడతామని సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య హెచ్చరించారు. ఆరు నెలల తర్వాత ఈ నెల 25న నిర్వహిస్తున్న కౌన్సిల్ సమావేశం ఎజెండా ప్రజలకు ఉపయోగపడేలా లేదని, కేవలం పాలకులు, అధికారుల జేబులు నింపుకొనేలా రూపొందించారని ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. సద్దుల బతుకమ్మకు ఫ్లడ్ లైట్ల కిరాయి కోసం రూ. 22 లక్షల బిల్లు పెట్టడం విడ్డూరంగా ఉంది. అదే డబ్బుతో కార్పొరేషనే నూతనంగా 1,200 లైట్లను శాశ్వతంగా కొనుగోలు చేయవచ్చు. కార్పొరేటర్లకు రూ. 30 లక్షలతో సెల్ఫోన్లు కొనిచ్చే బదులు, పేదలకు ఊరటనిచ్చే 'రూపాయి అంత్యక్రియల' పథకాన్ని వెంటనే ప్రారంభించాలి. కార్యాలయం రిపేర్లకు రూ. 20 లక్షలు, వర్షాకాలం ముగుస్తున్న వేళ వనమహోత్సవం పేరిట రూ. 64 లక్షలు కేటాయించడం కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే. 2024లో కేటాయించిన రూ. 62 లక్షల నిధులు లాప్స్ అవ్వడానికి కారణమైన అధికారులపై విచారణ జరపాలి. ఆ పనులకు ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 50 లక్షలు చెల్లించడం సరికాదు. స్మశానవాటికలు ముళ్లకంపలతో దుర్భరంగా ఉన్నా పట్టించుకోని పాలకులు, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే ప్రజాపోరాటాల ద్వారా బుద్ధి చెబుతామని సూర్య స్పష్టం చేశారు.

# ఖని లో ప్రేమోన్మాదానికి యువతి బలి!

- హత్య కేసును ఛేదించిన గోదావరిఖని పోలీసులు
- ఈర్ష్యతో పురుగుల మందు తాగించి దారుణం
- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్లాన్
- సీసీ టీవీ, కాల్ డేటాతో పట్టుబడ్డ నిందితులు
- లెక్చరర్ తో పాటు సింగరేణి ఓవర్ మన్ అరెస్ట్




**ప్రజా వాయిస్, గోదావరిఖని :**ప్రేమ, ఈర్ష్య కలిసిన ఒక ప్రేమోన్మాదం నిండు యువతి ప్రాణాన్ని బలిగొంది. గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపిన యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆత్మహత్యగా నమ్మించేందుకు ప్రయత్నించిన దారుణ హత్యను సాంకేతిక ఆధారాలతో వెలికితీశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన కాంట్రాక్ట్ లెక్చరర్‌తో పాటు, యువతిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సింగరేణి ఓవర్‌మన్‌ను రామగుండం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. కథనం లోపలికి వెళ్తే..నస్పూర్ పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న జెట్టి నవీన్ కుమార్ (38)కు, 2022లో అదే కళాశాలలో చదివిన యువతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే, ఆ యువతి బీటెక్ మైనింగ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం గోదావరిఖని వచ్చి, అక్కడ ఓవర్‌మన్‌గా పనిచేస్తున్న బొమ్మకంటి రవికుమార్ (35)కు దగ్గరవ్వడాన్ని నవీన్ తట్టుకోలేకపోయాడు. తీవ్ర ఆగ్రహం, ఈర్ష్యతో ఆమెను అంతమొందించాలని పథకం పన్నుకున్నాడు. ఈ క్రమంలో సెప్టెంబరు 12న విధులు ముగించుకుని వస్తున్న యువతిని నవీన్ బలవంతంగా తన ఈకోస్పోర్ట్ కారులోకి ఎక్కించుకున్నాడు. రవికుమార్ వేధింపుల వల్లే చనిపోతున్నట్లు కారులోనే సూసైడ్ నోట్ రాయించి, ఫోన్లో ఫొటోలు తీసుకున్నాడు. అనంతరం, ముందే తెచ్చుకున్న పురుగుల మందును బాధితురాలికి బలవంతంగా తాగించాడు. ఆమె స్పృహ తప్పడంతో, దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు జాప్యం చేస్తూ కారులోనే తిప్పాడు. చివరకు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి చేర్చి, అక్కడి నుంచి పరారయ్యాడు. చికిత్స పొందుతూ మరుసటి రోజు ఆమె ప్రాణాలు విడిచింది. నేరం నుండి తప్పించుకోవడానికి నిందితుడు కారును శుభ్రం చేసి, సూసైడ్ నోట్, ఫోన్ సిమ్‌లను ధ్వంసం చేశాడు. అయితే, రామగుండం సీపీ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన ఏసీపీ మడత రమేష్ బృందం.. సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా ఆధారంగా నవీన్‌తో పాటు, ఓవర్‌మన్ రవికుమార్‌ను అదుపులోకి తీసుకుంది. నిందితుల నుంచి కారు, ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, రవికుమార్ జరిపిన అక్రమంపై బాధితురాలు గతంలో సింగరేణి అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు, దానికి సంబంధించిన అధికారుల నిర్లక్ష్యంపై కూడా లోతైన విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# పోలీసు సిబ్బంది వైద్య సమస్యల పరిష్కారానికి కృషి

- గడ్డం క్రాంతి కుమార్
- ములుగు జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు



**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:**/ పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న వైద్య సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ములుగు జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను జిల్లా కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. పోలీసు సిబ్బందికి ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న విధంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న వైద్య సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గడ్డం క్రాంతి కుమార్ మాట్లాడుతూ....పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుంది. పోలీసు సిబ్బందికి సముచిత వైద్య సదుపాయాలు అందేలా సమస్య పరిష్కారం కోసం చట్టబద్ధమైన అన్ని మార్గాల్లో ముందుకు సాగుతామని, పోలీసుల సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని తెలిపారు.



# నల్లెల్ల కుమారస్వామి విగ్రహ ప్రతిష్ఠకు స్థలం కేటాయించాలి

- మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన భానోత్ రవిచందర్, కాంగ్రెస్ నాయకులు.

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:**/ ములుగు జిల్లా సాధన సమితి రాజకీయ సంయుక్త కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, దివంగత నల్లెల్ల కుమారస్వామి విగ్రహాన్ని ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ పరిధిలో స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ జనగాం సంపత్‌కు వినతి పత్రం అందజేశారు. సెప్టెంబర్ 29న నల్లెల్ల కుమారస్వామి జయంతి సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మున్సిపాలిటీ పరిధిలో కేటాయించి సహకరించాలని కమిషనర్‌ను కోరారు.

### నల్లెల్ల కుమారస్వామి సేవలు చిరస్మరణీయం. భానోత్ రవిచందర్.

ఈ సందర్భంగా భానోత్ రవిచందర్ మాట్లాడుతూ..... ములుగు జిల్లా సాధన కోసం నల్లెల్ల కుమారస్వామి చేసిన పోరాటం, ప్రజాసేవలు చిరస్మరణీయమని అన్నారు. జిల్లా ఏర్పాటు కోసం ఆయన చేసిన కృషిని భవిష్యత్ తరాలకు గుర్తుండేలా ములుగు జిల్లా కేంద్రంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు మున్సిపాలిటీ అధికారులు స్థలం కేటాయించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, కౌన్సిలర్లు పోడాల ఓంప్రకాష్, ఎండీ కుతుబుద్దీన్, మండల పార్టీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్లెల్ల భరత్ కుమార్, బీసీ విభాగం జిల్లా నాయకులు గందే శ్రీను, ములుగు మాజీ ఉప సర్పంచ్ ఎల్లావుల అశోక్ యాదవ్, తనుగుల విజయ్ యాదవ్, గూడెపు రాకేష్, ఆఫ్రోజ్ పాల్గొన్నారు.

# రోడ్డు పనుల జాప్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం

- జోగాపూర్ - మైలారం రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి
- అసత్య ప్రచారాలను ఖండించిన గ్రామ యువత
- అధ్యక్షుడు లింగంపల్లి రాజేష్

**ప్రజా వాయిస్ - మంచిర్యాల జిల్లా** / నెన్నెలమంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జోగాపూర్ నుండి మైలారం గ్రామానికి వెళ్లే రోడ్డు పనుల ప్రారంభంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ యువత అధ్యక్షుడు లింగంపల్లి రాజేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులే రోడ్డు పనులను అడ్డుకుంటున్నారంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు మద్యం సేవించి తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. అస్తవాలను ప్రజలకు తెలియనివ్వకుండా, రాజకీయం చేయడం సరికాదన్నారు. రోడ్డు పనులు ప్రారంభించడంలో విఫలమైన అధికార పార్టీ నాయకులు, తిరిగి బీఆర్ఎస్ పై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

### దళిత సర్పంచ్ కు అవమానం..

రాజ్యాంగాన్ని కించపరచడమే:ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన దళిత సర్పంచ్ విధులకు ఆటంకం కలిగించేలా కొందరు ప్రవర్తిస్తున్నారని రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓడిపోయిన వ్యక్తి భర్తకు సర్పంచ్ పదవి ఇవ్వాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం భారత రాజ్యాంగాన్ని కించపరచడమేనని ఆయన దుయ్యబట్టారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిలిచిపోయిన జోగాపూర్ – మైలారం రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాడి లక్ష్మి , ఉప సర్పంచ్ వేల్పుల మొగిలి, మాజీ పాక్స్ చైర్మన్ ఇందూరి రమేష్, మాజీ సర్పంచ్ గడ్డం తిరుపతి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జాడి నారాయణ, గడ్డం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణిలో మహిళలకు రక్షణ కరువు!

- యాజమాన్యం తక్షణమే స్పందించాలి
- బీజేపీ నాయకులు



**ప్రజా వాయిస్ రామగిరి** మండలంలోని తన గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ నాయకుడు ములుమూరి శ్రీనివాస్ మాట్లాడారు. సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, కార్మికులు, శిక్షణార్థులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. మహిళలపై సాగుతున్న వేధింపులను అరికట్టి, రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో ఇటీవల ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ తంద్ర అక్షిత ఆత్మహత్య ఘటనపై ఆమె కుటుంబ సభ్యులు సింగరేణి ఉద్యోగిపై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు వెలుగులోకి వచ్చినా యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. సింగరేణి పరిధిలో వేధింపుల నివారణకు ప్రత్యేక ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని, షీ టీమ్స్, పోలీస్ హెల్ప్‌లైన్ వివరాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమస్యను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దండే లక్ష్మీనారాయణ, మెరుగు శ్రీకాంత్, తీగల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గుత్తేదారు నిర్లక్ష్యంతో అధ్వానంగా మారిన రోడ్డు

- పంట పొలాలకు వెళ్లే దారికి మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్.

**ప్రజా వాయిస్ కన్నెపల్లి/** మంచిర్యాల మంచిర్యాల జిల్లా కన్నేపల్లి మండలములోని విరాపూర్ గ్రామములోని రైతులుపంట పొలాలకు వెళ్లే దారి అధ్వానంగా మారిందని రైతులు వాపోతున్నారు. వీరాపూర్ గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు సొండ్ల శంకర్ ఇంటి నుండి జంబి లచ్చయ్య ఇంటి వరకు మంజూరైనా సి సి రోడ్డును పూర్తిగా అధికారుల నిర్లక్ష్యంతో మద్యలోనే నిర్మాణ పనులు ఆపివేయడంతో సొండ్ల శంకర్ ఇంటి నుండి ఏకారి రామయ్య చేను వరకు సదరు గుత్తే దారు ప్రొసిడింగ్ ని పాటించకుండా రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని రైతులు వివరించడం జరిగింది.. ప్రతిరోజూ వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పంటలకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు తదితర వ్యవసాయ సామగ్రిని పొలాలకు తరలించేటప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై నీరు నిలిచిపోవడంతో ఎరువులు, ఇతర సామగ్రి తడిసి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రహదారి ద్వారా సుమారు 200 ఎకరాల పంట పొలాలకు నిత్యం రైతుల రాకపోకలు కొనసాగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో రహదారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు స్పందించి వీరాపూర్ గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి, రైతులకు రాకపోకల ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.





# గణనాథునికి 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం

- భారత్ నగర్ లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- 108 లీటర్ల ఆవుపాలతో గణనాథునికి అభిషేక మహోత్సవం
- ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు
- సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పండాలని ఆకాంక్ష
- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ ఎస్ పార్టీ ఇన్ చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి

**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా** / గజ్వేల్ నియోజకవర్గం :గజ్వేల్ పట్టణంలోని 14వ వార్డు భారత్‌నగర్‌లో సిరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథునికి 108 లీటర్ల ఆవుపాలతో అభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం గణనాథుని అభిషేకానికి 108 లీటర్ల ఆవుపాలను సమకూర్చిన దాత జిల్లా కళ్యాణ్‌ను వంటేరు ప్రతాప్‌రెడ్డి అభినందించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అభిషేక కార్యక్రమంలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... గణనాథుని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని గణనాథుని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అభిషేక మహోత్సవంలో కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు, టింకు రెడ్డి, జగ్గయ్యపేట శేఖర్, బాలేష్, బాలకృష్ణ, రాజు, గుడ్డు, శివక్రాంతి, సిరి యూత్ అసోసియేషన్ సభ్యులు, భారత్‌నగర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



## దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు పొందిన ప్రజా వాయిస్ బృందం

- భీమా-అమరజ సంగమంలో పవిత్ర స్నానం అనంతరం దత్తాత్రేయ స్వామి దర్శనం
- "దత్తాత్రేయ స్వామి దర్శనం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది."
- ప్రజా వాయిస్ సీఈవో మేనం శ్యాం






ప్రజా వాయిస్ కర్ణాటక; కలబురగి (గుల్బర్గా) జిల్లా:/ కర్ణాటక రాష్ట్రంలోని కలబురగి జిల్లాలోని గాణగాపుర ప్రసిద్ధ శ్రీక్షేత్ర దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని ప్రజా వాయిస్ సీఈవో మేనం శ్యాం, ప్రజా వాయిస్ ప్రతినిధులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం భీమా–అమరజ నదుల సంగమ ప్రాంతాన్ని సందర్శించి పవిత్ర స్నానం ఆచరించడం జరిగింది. దత్తాత్రేయ స్వామి దర్శనంతో భక్తి భావంలో తన్మయత్వం పొందారు. సీఈవో మేనం శ్యాం మాట్లాడుతూ.....దత్తాత్రేయ స్వామి దర్శనం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. భీమా–అమరజ నదుల సంగమం ఎంతో పవిత్రమైన ప్రదేశమని, ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణం మనసుకు ప్రశాంతతను కలిగిస్తుందని పేర్కొన్నారు.

**"దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి."**
**అచ్చునూరి కిషన్.**

ఈ సందర్భంగా ప్రజా వాయిస్ ములుగు జిల్లా బ్యూరో అచ్చునూరి కిషన్ మాట్లాడుతూ.....గాణగాపుర దత్తాత్రేయ స్వామి దర్శనం జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని తెలియజేస్తూ, దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ప్రజా వాయిస్ బ్యూరో చీఫ్ ఎస్. పటేల్ సుధాకర్, మంచిర్యాల జిల్లా నేర విభాగం ప్రతినిధి కస్తూరి రాకేష్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మదాసు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బచ్చన్నపేట మండలంలో బెల్ట్ షాపుల జోరు

- ప్రభుత్వం బెల్ట్ షాపులు ఏర్పాటు చేయాలని చెప్పిందా?
- వైన్ షాపుల పార్కింగ్ ఎక్కడ? రోడ్డుపైనే బైక్ పార్కింగ్
- బచ్చన్నపేట నుంచి ఆలేరు, సిద్దిపేట, జనగామ రూట్లలో బెల్ట్ దందాలు
- ఒక గ్రామంలో 2450 జనాభా! బెల్ట్ షాపులు 15
- మా ప్రాణాలు మా కుటుంబాలు రోడ్డున పడుతున్న పట్టించుకోరా?
- లక్షల జీతాలు తీసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు ఉంటే ఎంత లేకుంటే ఎంత?
- బెల్టు షాపుల వల్ల ప్రభుత్వానికి లాభమా?
- వైన్ షాప్ యజమాన్యానికి లాభమా?
- అబ్కారి వ్యవస్థనే తీసివేయాలని ప్రజల డిమాండ్
- మద్యం విక్రయాలపై నిఘా ఏదీ
- ఎక్సైజ్ శాఖ లంచాలకు మరిగారా?






ప్రజా వాయిస్/బచ్చన్నపేట (జనగామ జిల్లా బ్యూరో)జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో బెల్ట్ షాపుల జోరు పెరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు విస్తరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు వైన్ షాపుల ముందు ప్రధాన రహదారి పైనే వాహనాలు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ, నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### వైన్ షాపులకు పార్కింగ్ ఎక్కడ? మెయిన్ రోడ్డు పైనే బైక్ ల పార్కింగ్ ..

బచ్చన్నపేట మండల కేంద్రంలోని వైన్ షాపుల వద్ద మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వారు రోడ్డుపైనే బైక్ లు పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ప్రధాన రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ నియంత్రణ, ప్రజల భద్రతపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. మద్యం సేవించిన తర్వాత మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు.

### ఆలేరు జనగామ సిద్దిపేట్ రూట్ లో బెల్ట్ దందాల హవా?

బచ్చన్నపేట నుంచి ఆలేరు వెళ్లే మార్గంలో పలు గ్రామాల పరిధిలో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సులభంగా లభిస్తుండటంతో కుటుంబాలపై ఆర్థిక భారం, యువతపై ప్రభావం పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరుతున్నారు. అలాగే ఎక్సైజ్ అధికారులు ఉన్నారా లేరా ఉండి ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారా? అనేది ప్రజలలో వాదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఎక్సైజ్ అధికారులు ఉంటే ఎంత లేకుంటే ఎంత అనే వాదన కూడా మహిళలలో ఎక్కువగా వినపడుతుంది.బచ్చన్నపేట–సిద్దిపేట ప్రధాన మార్గంలో కూడా కిరాణా కూడా మద్యం షాపుల పరిధిలో బెల్ట్ విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేని ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా చేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. అక్రమ విక్రయాలు ఉంటే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### జనగామ రూట్ లోనూ బెల్ట్ షాపుల హవా

బచ్చన్నపేట నుంచి జనగామ వెళ్లే మార్గం లోనూ బెల్ట్ షాపులు పెరుగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రధాన రహదారులకు సమీపంలోని గ్రామాల్లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ స్పందించాల్సి ఉంది. అనుమతులు లేని విక్రయ కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### లక్షల జీతాలు తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ నిఘా ఎక్కడ?

మద్యం విక్రయాలపై ప్రభుత్వం నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులపై ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. వైన్ షాపుల నుంచి మద్యం ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతోందా? అనుమతులు లేని విక్రయ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించాల్సిన అవసరం ఉంది.


### ప్రజల ఇబ్బందులు తొలగించాలి

మద్యం విక్రయాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ సమస్యను పరిష్కరించడంతోపాటు, బెల్ట్ షాపులపై ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. బచ్చన్నపేట మండలంలో మద్యం విక్రయాలపై సమగ్ర తనిఖీలు చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.


## గోపాల్పూర్ లో ఒంటరి వృద్ధురాలిపై దాడి

- కాంగ్రెస్ నాయకురాలు, ఆమె కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు





**ప్రజా వాయిస్: హుస్నాబాద్/** ఎల్కతుర్తి ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలో 60 ఏళ్ల ఒంటరి వృద్ధురాలు బూర సారమ్మపై జరిగిన దాడి స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు, వార్డు మెంబర్ శ్రీపతి లావణ్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు శ్రీపతి బతుకమ్మ, శ్రీపతి రాజేందర్, శ్రీపతి ప్రసాద్‌లు తనను చంపే ఉద్దేశంతోనే దారుణంగా కొట్టారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది.సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం గ్రామంలోని కొందరు వ్యక్తులతో తన కుటుంబ సమస్యలపై మాట్లాడుకుంటున్న సమయంలో, అసలు ఆ విషయంతో ఎలాంటి సంబంధం లేని ఈ నలుగురు వ్యక్తులు అక్కడికి వచ్చి తనపై దాడికి దిగారని సారమ్మ తెలిపింది. వారు విచక్షణారహితంగా కొడుతుండగా గ్రామస్థులు అడ్డుపడి తనను కాపాడారని, ఈ ఘటనలో తనకు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొంది. ఈ దారుణంపై సెప్టెంబర్ 17న ఎల్కతుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, మూడు రోజులు గడిచినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తనపై దాడి చేసిన వారి నుంచి ప్రాణహాని ఉందని, నిందితులపై సమగ్ర విచారణ జరిపి తనకు రక్షణ కల్పించాలని వేడుకుంది.తన తల్లికి అసలు ఆ కుటుంబంతో ఉన్న వివాదమేమిటో, వారు ఎందుకు కక్ష పెంచుకున్నారో పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధితురాలి కుమార్తె సట్ల రమాదేవి కోరారు. కాగా, చంపే ఉద్దేశంతో దాడి చేశారన్న ఫిర్యాదు ఆధారంగా గాయాల తీవ్రత, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఘటన తీవ్రతను బట్టి భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 109 లేదా ఇతర సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఈ ఘటనపై త్వరితగతిన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## కరెంటు కోసం రైతుల కన్నెర్ర

- నాణ్యమైన విద్యుత్ ఇవ్వకపోతే జాతీయ రహదారులు దిగ్బంధిస్తాం
- సబ్ స్టేషన్లను ముట్టడిస్తాం.. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం
- కాంగ్రెస్ సర్కారుపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ధ్వజం

**ప్రజా వాయిస్,నడిగూడెం:** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ రైతులతో కలిసి ఆందోళనకు దిగారు. నడిగూడెం మండలం కరివిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కరెంటు కోతలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. బోర్లు, బావుల కింద సాగు చేస్తున్న పంటలకు సకాలంలో విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి కనీసం కరెంటు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాన్ని అధికారులపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.


### 22ఏ పేరుతో వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారం

22ఏ పేరుతో వ్యవసాయ రంగాన్ని రియల్ ఎస్టేట్ వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ రహదారులను స్తంభింపజేయడంతోపాటు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతుల కోసం అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

## వార్డు మెంబర్ కుటుంబానికి సర్పంచ్ చేయూత

- పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించిన ముద్దం సునీత వీరారెడ్డి

**ప్రజా వాయిస్/తొర్రూర్** ర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ 9వ వార్డు మెంబర్ కిన్నెర నగేష్ మాతృమూర్తి కిన్నెర ముత్యాలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం దశదినకర్మ సందర్భంగా ఆ కుటుంబానికి స్థానిక సర్పంచ్ ముద్దం సునీత వీరారెడ్డి రూ.10,000వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, షాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, బీజేపీ మండల రూరల్ అధ్యక్షుడు గట్టు రాంబాబు గౌడ్, మాజీ ఎంపీటీసీ కొత్తూరు బ్రహ్మయ్య మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు





## బెల్లంపల్లిలో వికాస తరంగిణి కమిటీ ఏర్పాటు

- ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల నిర్వహణే లక్ష్యం
- రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహణ

**ప్రజా వాయిస్ - మంచిర్యాల** / బెల్లంపల్లి రూరల్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి అనుగ్రహ ఆశీస్సులతో బెల్లంపల్లిలో వికాస తరంగిణి కమిటీని ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలనే లక్ష్యంతో కమిటీ సభ్యులను నియమించారు. ఈ కమిటీలో ప్రధాన సమన్వయకర్తగా బుద్ధవరం లావణ్య గిరిధరాచార్యులు, సమాచార సమన్వయకర్తగా దండు సతీష్, కోశాధికారిగా జూపాక స్వర్ణలత, ప్రజ్ఞా వికాస్ సమన్వయకర్తగా ఆకునూరి పూజిత, మహిళా ఆరోగ్య వికాస్ సమన్వయకర్తగా సముద్రాల సంధ్యారాణి, యువ వికాస్ సమన్వయకర్తగా దుగుట విలాస్, సంస్కార వికాస్ సమన్వయకర్తగా దండు శ్యామల నియమితులయ్యారు.ఈ సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో రాధాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు హనుమంతరావు, సమన్వయకర్త ఉమ అమ్మ, మంజుల, సువర్ణ తదితరులు పాల్గొని కార్యక్రమానికి తమ ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వికాస తరంగిణి ద్వారా భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తూ, ప్రజలకు సేవ చేయడమే కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు

## ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ ప్రిలిమినరీ పరీక్షకు విశేష స్పందన

- జిల్లా వ్యాప్తంగా 2,243 మంది అభ్యర్థుల హాజరు
- 500 మందికి ఉచిత శిక్షణ
- నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు
- జిల్లా ఎస్పి. శరత్ చంద్రపవార్.





**ప్రజా వాయిస్ / నల్లగొండ క్రైమ్:** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహించిన ప్రిలిమినరీ స్క్రీనింగ్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,243 మంది అభ్యర్థులు హాజరయ్యారు.నల్లగొండ పరీక్ష కేంద్రంలో 1,464 మంది, మిర్యాలగూడలో 464 మంది, దేవరకొండలో 315 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అర్హులైన అభ్యర్థుల్లో 500 మందిని ఎంపిక చేసి నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ అందించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని బాధ్యతగా తీసుకుని క్రమశిక్షణతో శిక్షణకు హాజరై, పట్టుదలతో చదువుతూ శారీరక దృఢత్వంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.శిక్షణలో ప్రిలిమినరీ పరీక్షతో పాటు సబ్జెక్ట్ నిపుణులతో బోధన, పరీక్షల విధానంపై అవగాహన, మోడల్ టెస్టులు, సందేహాల నివృత్తి, శారీరక దారుఢ్యానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పోలీస్ ఉద్యోగం కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు.జిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎంపికయ్యే 500 మంది అభ్యర్థులు పట్టుదలతో శ్రమించి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకాంక్షించారు.





## మాధవ్ నగర్ కాలనీలో వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- 56 రకాల నైవేద్యాలతో పూజలు
- ఘనంగా అన్నదాన కార్యక్రమం

**ప్రజా వాయిస్ పెద్ద శంకరంపేట:** పట్టణ కేంద్రంలోని మాధవ్ నగర్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ గణనాథుడికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఏకంగా 56 రకాల స్వీట్లను మహా నైవేద్యంగా భక్తితో సమర్పించి స్థానికులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోలాహలం, వేద మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి.అనంతరం వినాయక మండపం వద్ద కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్ద శంకరంపేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు స్థానిక నాయకులు మురళీ పంతులు, జంగం శ్రీనివాస్, వేణుగోపాల్ గౌడ్, విగ్రం శ్రీనివాస్ గౌడ్, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆశీస్సులు పొందారు.ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో మాధవ్ నగర్ కాలనీ అధ్యక్షులు రాగం శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రభాకర్, భాను, పెంటయ్య సార్, సంతోష్ కుమార్, దాదిగారి గంగాధర్, బుత్కురి అక్షయ్,మరియు ఇతర యువకులు చురుగ్గా పాల్గొన్నారు.



## అర్కెల, నార్సింగి రహదారి అధ్వానం

- వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనం

**ప్రజా వాయిస్, పాపన్నపేట.** పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి అరికెల, డాక్య తండా నుంచి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులకు రామానుజాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇకనైనా అధికారులు స్పందించి రహదారికి నాణ్యమైన మరమ్మత్తులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



## రోడ్డుపై మార్కెట్‌తో ట్రాఫిక్ సమస్య

- మార్కెట్ స్థలం కోసం వ్యాపారస్తుల ధర్నా
- వ్యాపారులకు అండగా మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి
- సాయిరామ్ ఎన్ క్లేవ్ ఫేస్-2 ఎదురుగా మార్కెట్ కు స్థల పరిశీలన

**పటాన్ చెరువు ప్రజావాయిస్** అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని గాంధీ బొమ్మ దగ్గర మార్కెట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వ్యాపారస్తులు ఆదివారం ధర్నా నిర్వహించారు అమీన్‌పూర్ గ్రామంలో గురువారం, ఆదివారం నిర్వహించే వారపు సంత వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, రోడ్లపై దుకాణాలు పెట్టవద్దని జీహెచ్ఎంసీ సిబ్బంది హెచ్చరించడంతో వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రోడ్డుపై వ్యాపారాలు చేసుకునే వీలులేక, జీవనోపాధి కోల్పోయే పరిస్థితి రావడంతో మార్కెట్ వ్యాపారులంతా కలిసి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డిని ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకున్నారు.ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ, ప్రధాన రహదారులపై మార్కెట్లు నిర్వహించడం వల్ల వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని, ప్రజా రవాణాకు ఆటంకం కలిగితే అధికారులు కానీ, ప్రజలు కానీ ఊరుకోరని పేర్కొన్నారు. అదే సమయంలో చిరు వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు.సమస్యకు శాశ్వత పరిష్కారంగా, అమీన్‌పూర్ నుంచి నవ్య చౌరస్తాకు వెళ్లే మార్గంలో గల సాయిరామ్ ఎన్‌క్లేవ్ ఫేస్–2 ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆయన స్వయంగా పరిశీలించి మార్కెట్ ఏర్పాటుకు కేటాయించారు. ఆ స్థలాన్ని వెంటనే జేసీబీలతో చదును చేయించి, వ్యాపారాలకు, వినియోగదారులకు అనుకూలంగా తగిన విద్యుత్ లైట్ల సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.మాజీ చైర్మన్‌కు వ్యాపారుల కృతజ్ఞతలుఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు మాట్లాడుతూ.. "గత రెండు, మూడు వారాలుగా జీహెచ్ఎంసీ అధికారులు రోడ్లపై దుకాణాలు వేయవద్దంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఎక్కడికి వెళ్లాలో తెలియక మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ని సంప్రదించాం. మా సమస్య విన్న వెంటనే ఆయన అత్యంత సానుకూలంగా స్పందించి, వెంటనే ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. అంతేకాకుండా జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయించి, లైట్లు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చి మా పొట్ట నింపారు" అంటూ వ్యాపారులంతా తుమ్మల పాండురంగారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, ఉపేందర్ రెడ్డి, దశరథ్, స్థానిక నాయకులు, మార్కెట్ వ్యాపార సంఘం ప్రతినిధులు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల సముదాయమా.. లేక పార్కింగ్ యార్డా

- కార్యాలయాల సముదాయంలో రోజుల తరబడి కార్ల పార్కింగ్
- పట్టాలు కప్పి వాహనాలు
- పట్టించుకోని అధికారుల తీరు
- దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులకు తప్పని తిప్పలు
- గ్రేడ్–1 మున్సిపాలిటీలో నిర్వహణపై ప్రశ్నలు





**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:** ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన కార్యాలయాల సముదాయం ప్రస్తుతం వ్యక్తిగత వాహనాల పార్కింగ్ ప్రదేశంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రేడ్–1 మున్సిపాలిటీగా ఉన్న మిర్యాలగూడలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నెలకొన్న ఈ పరిస్థితిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎంపీడీఓ కార్యాలయం, భవిత సెంటర్, మీ–సేవ, వ్యవసాయ శాఖ కార్యాలయం, రైతు వేదిక తదితర కీలక ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. నిత్యం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ పనుల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇలాంటి రద్దీ ప్రాంగణంలో కార్యాలయ సముదాయంలో పలు కార్లను రోజుల తరబడి నిలిపి ఉంచడం ఇబ్బందికరంగా మారింది.

### కార్లకు పట్టాలు.. ప్రజలకు ఇబ్బందులు

భవిత సెంటర్ ఎదుట కొన్ని కార్లకు పట్టాలు, కవర్లు కప్పి రోజుల తరబడి నిలిపి ఉంచుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వాహనాలు వరుసగా నిలిచి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అంటున్నారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల విద్య, శిక్షణ, పునరావాసానికి సంబంధించిన సేవలు అందించే భవిత సెంటర్‌కు వచ్చే దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాహనాల నిలిపివేత కారణంగా ఇబ్బంది ఏర్పడటంతో పాటు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా అసౌకర్యం కలుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

### గ్రేడ్–1 మున్సిపాలిటీలో ఇదేం నిర్వహణ..

మిర్యాలగూడ గ్రేడ్–1 మున్సిపాలిటీగా ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం ప్రజల సౌకర్యం కోసం ఉండాలా.. లేక వ్యక్తిగత వాహనాలను రోజుల తరబడి నిలిపే పార్కింగ్ యార్డుగా మారాలా..అని నిలదీస్తున్నారు.ప్రత్యేకంగా దివ్యాంగ పిల్లలు వినియోగించే భవిత సెంటర్ ఎదుట ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రోజుల తరబడి వాహనాలు అక్కడే ఉన్నా వాటిని తొలగించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### అధికారులు స్పందించాలి

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో రోజుల తరబడి నిలిపి ఉంచిన వాహనాలపై అధికారులు విచారణ జరిపి, ప్రజలకు ఇబ్బంది కలిగించే పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా భవిత సెంటర్ ప్రవేశ మార్గాన్ని పూర్తిగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.మిర్యాలగూడ గ్రేడ్–1 మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇక్కడ ఎన్ఎస్పీ స్థలాలు, బంగళాలు ఉచితంగా ఇవ్వబడును?

- అంగన్ వాడీలు అద్దె కొంపల్లో.. చిన్నారులు ఇరుకు గదుల్లో!
- అంగన్ వాడీలకు లేని జాగ.. బడా బాబులకు ఎలా దక్కింది?
- గతంలో గ్రానైట్ మాఫియా కోసం గురుకులాన్ని గెంటేశారు
- భూగర్భ జలాలను పాతరేశారు!
- ఇప్పుడు విలువైన భూమిలో 'స్త్రీశక్తి' ముసుగులో పెట్రోల్ బంకు దందా?
- తాళాలు వేసి ఉన్న సర్కారు క్వార్టర్లు సంఘాలకు నజరానా?
- నేలకొండపల్లిలో బరితెగించిన అధికార యంత్రాంగం!






**ప్రజా వాయిస్ ఖమ్మం:**భావి భారత పౌరులైన పసిపిల్లలు అద్దె కొంపల్లో, కనీస వసతులు లేని చీకటి ఇరుకు గదుల్లో నరకం చూస్తుంటే.. మరోపక్క కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు, విలాసవంతమైన క్వార్టర్లను పైరవీకారులకు, ప్రైవేట్ వ్యాపారులకు ఉచితంగా పంచిపెడుతున్నారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ భూములు, భవనాల వ్యవహారం చూస్తుంటే ప్రజా ఆస్తులు ఉచితంగా ఇవ్వబడును అన్న బోర్డు తగిలించి అంగట్లో అమ్మకానికి పెట్టిన దుస్థితి స్పష్టమవుతోంది.మండల కేంద్రంలో సాక్షాత్తూ ప్రభుత్వమే నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత గూడు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. అరకొర వసతులు, గాలివెలుతురు సరిగ్గా సోకని ఇరుకు గదుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వంత భవనాల నిర్మాణం కోసం సెంటు స్థలం కేటాయించలేని చేతకాని పాలకులు.. ప్రైవేట్ వ్యక్తులకు, వాణిజ్య వ్యాపారాలకు మాత్రం ఎకరాల కొద్దీ విలువైన ఎన్ఎస్పీ భూములను పళ్లెంలో పెట్టి అప్పగిస్తుండటం దేనికి సంకేతం? ప్రజా సంక్షేమం కంటే వ్యాపార లాబీయింగే ముఖ్యమా అని ప్రజలు నిలదీస్తున్నారు.గతంలో పేద విద్యార్థుల చదువుల కోసం ఎన్ఎస్పీకి చెందిన అత్యంత విలువైన భూమిని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు కేటాయించారు. అయితే, ఆ స్థలం కింద ఉన్న అపారమైన గ్రానైట్ సంపదపై కన్నేసిన ప్రైవేట్ వ్యాపారులు, నాటి పాలకులతో కుమ్మక్కై విద్యార్థులను బలవంతంగా ఆనంతనగర్ గ్రామ శివారుల్లోకి నెట్టివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత అక్కడ సాగిన విచ్చలవిడి గ్రానైట్ దోపిడీ ఫలితంగా మండల కేంద్రంలో విలువైన భూములు ప్రైవేట్ పరం కావడమే కాకుండా, భూగర్భ జలాలు పూర్తిగా పాతాళానికి పడిపోయాయి. నేడు మండల ప్రజలు గుక్కెడు తాగునీటికి తల్లడిల్లే దుస్థితికి ఈ గ్రానైట్ దందాయే కారణం.ఆ విధ్వంసం చాలదన్నట్లు, ఇప్పుడు మిగిలి ఉన్న ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఖరీదైన ఎన్ఎస్పీ స్థలాన్ని కొల్లగొట్టేందుకు మరో ఎత్తుగడ వేశారు. మహిళా సాధికారత ముసుగులో 'స్త్రీశక్తి పెట్రోల్ బంక్' ఏర్పాటు పేరుతో వాణిజ్య ప్రయోజనాలకు ఈ స్థలాన్ని కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అంగన్‌వాడీలకు, ప్రభుత్వ గ్రంథాలయాలకు, బస్టాండు అభివృద్ధికి స్థలం లేదని చెప్పే అధికారులు.. పెట్రోల్ బంకులకు మాత్రం ఎర్ర తివాచీలు పరుస్తుండటం వెనుక భారీ ముడుపుల వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మరోవైపు ఎన్ఎస్పీ క్యాంప్ కాలనీలోని ఇరిగేషన్ సబ్–డివిజన్–4 పరిధిలో ఖాళీగా ఉన్న అత్యంత విలాసవంతమైన A–3 క్వార్టర్ (బంగ్లా)ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం స్థానిక యూనిట్ కార్యాలయం కోసం గుట్టుచప్పుడు కాకుండా కేటాయిస్తూ ఖమ్మం ఇరిగేషన్ సీఈ కార్యాలయం నుంచి ప్రొసీడింగ్ జారీ అయ్యాయి. అద్దె భవనాల్లో మగ్గుతున్న అంగన్‌వాడీలకు ఈ భవనాన్ని కేటాయిస్తే ఎంతో మంది చిన్నారులకు ఉపయోగపడేది కాదా? ప్రజావసరాలను తుంగలో తొక్కి, ఉద్యోగ సంఘాల ఒత్తిళ్లకు తలొగ్గి సర్కారు బంగ్లాను రాసివ్వడం ఎంతవరకు సమంజసమని ప్రజలు మండిపడుతున్నారు. ఒకప్పుడు ప్రాజెక్టు పనులతో కళకళలాడిన ఎన్ఎస్పీ ప్రాంగణాలు నేడు గ్రానైట్ మాఫియాకు, పెట్రోల్ బంకులకు, సంఘాల భవనాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రలేచి.. ఎన్ఎస్పీ స్థలాల, క్వార్టర్ల కేటాయింపులను తక్షణమే రద్దు చేయాలి. ఆ స్థలాలను అద్దె గదుల్లో నలిగిపోతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రజా ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలి. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి భారీ ప్రజా ఉద్యమం నిర్మిస్తామని ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నాయి.

## రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటూ పాదయాత్ర

- పెద్ద శంకరంపేటలో కాటూరి వెంకటేశ్వర్లుకు ఘన స్వాగతం



**ప్రజా వాయిస్ పెద్ద శంకరంపేట:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన "రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా" (Raga For Rise of India) పాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు తలపెట్టిన ఈ మహా పాదయాత్ర ఆదివారం మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పెద్ద శంకరంపేట మీదుగా సాగింది.ఈ సందర్భంగా పెద్ద శంకరంపేటకు చేరుకున్న కాటూరి వెంకటేశ్వర్లుకు మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక సర్పంచులు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆయనతో కలిసి అడుగులు వేస్తూ పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాటూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడాలన్నా, సామాజిక న్యాయం చేకూరాలన్నా, సమగ్ర అభివృద్ధి సాధ్యం కావాలన్నా రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమన్నారు. ఆయన నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలనే బలమైన సంకల్పంతోనే "రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా" నినాదంతో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన తాను గత 94 రోజులుగా నిర్విరామంగా నడుస్తున్నానని, 15 రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించిన ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు.





# రైతన్నకు దిక్కెవరు?

- అభివృద్ధి పేరుతో భూములు.. రైతు భవిష్యత్తుకు భరోసా ఏది?
- రోడ్ల కోసం రైతుల భూములే ఎందుకు?
- రాజకీయ పార్టీల తీరుపై అన్నదాతల ఆవేదన

**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:** అభివృద్ధి పనులకు రహదారులు, పరిశ్రమలు, ఇతర మౌలిక వసతులు అవసరమే. అయితే ఆయా ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయే రైతుల భవిష్యత్తుపై సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుకు భూమి కేవలం ఆస్తి కాకుండా ప్రధాన జీవనాధారం.ప్రాజెక్టుల కోసం భూములు సేకరించే సమయంలో పరిహారం, పునరావాసం, ప్రత్యామ్నాయ జీవనోపాధి వంటి అంశాలపై రైతులకు స్పష్టమైన భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటే ఆందోళనలు, అభ్యంతరాలు తలెత్తే అవకాశం ఉంది.మరోవైపు రైతు సమస్యలు రాజకీయ పార్టీలకు ప్రధాన అంశంగా మారుతున్నప్పటికీ.. అవి రాజకీయ ప్రయోజనాలకు పరిమితం కాకుండా విధానపరమైన పరిష్కారాల దిశగా సాగాలనే డిమాండ్ వినిపిస్తోంది. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా రైతు ప్రయోజనాల విషయంలో ఒకే విధమైన చిత్తశుద్ధి చూపాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.అభివృద్ధి పనులు జరగాలి.. రహదారులు నిర్మించాలి.. కానీ ఆ అభివృద్ధి కోసం భూమి కోల్పోయిన రైతు కుటుంబం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకూడదన్నదే ఇవాళ్టి ప్రజావాయిస్ ప్రత్యేక కథనం.

# తెలంగాణ బియ్యం ఆంధ్ర కి ప్రయాణం!

- టూవీలర్ల ద్వారా రైస్ ను తరలిస్తున్న వైనం?
- పట్టణంలో ప్రభుత్వ బియ్యాన్ని కిలో 16 రూ. కి విక్రయాలు?
- పాపిడి గూడెం రహదారి గుండా ప్రవేశిస్తున్నట్లు కీలక సమాచారం!
- ఆగస్టు నెలలో 40 క్వింటాల తరలించినట్లు విశ్వసనీయ సమాచారం!
- సర్కార్ బియ్యం పై కట్టడి శూన్యమేనా అంటూ హేతువులు!?
- ఆంధ్ర కేటుగాళ్ల ద్వారా భారీ స్థాయిలో వ్యాపారాలు







**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** ప్రస్తుతం రాష్ట్రంలో సర్కార్ బియ్యం అక్రమ వ్యాపారాలపై నిఘా అంతంత మాత్రమే ఉందని తెలుస్తుంది. అంతేకాకుండా వ్యాపారస్తులతో అధికారులు రాజి పడి చూసి చూడనట్లుగా వ్యవహరించడమే దీనికి ప్రధాన కారణం అని గట్టిగానే ప్రచారం వినిపిస్తుంది. కొందరు కేటుగాళ్లు పుష్ప సినిమా వల్లే టూ వీలర్లపై ఇంటింటికి వెళ్లి సర్కారు బియ్యాన్ని పట్టి యదేచ్చగా ఆంధ్ర తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క ఆగస్టు నెలలోనే 40 క్వింటాల రైస్ ను తరలించి లక్షల గణించాడంటే అట్టి వ్యాపారం చెన్నాచెతగాని కాదని తెలుస్తుంది. నిజానికి ఇటువంటి దందాకి పాల్పడే వ్యాపారస్తులు అధికారులకు ముడుపులు చెల్లించే తమ విధివిధానాలను యదేచ్చగా కొనసాగిస్తున్నారా! లేక రహస్యంగా తరలిస్తున్నారా! అన్నది అంతు పట్టని ప్రశ్నా! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలో పదుల సంఖ్యలో సర్కారు వారి చౌక్ దుకాణాలు ఉన్నాయి. ఇటువంటి దుకాణాల్లో నిరుపేదలకు బియ్యాన్ని పంపిణీ కార్యక్రమం ప్రతినెల కొనసాగుతూనే ఉంది. అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని నిరుపేదలకు అందించడం వ్యాపారస్తులకు వరంగా మారింది. అట్టి రైస్ ను కొందరు ఆంధ్ర వ్యాపారస్తులు తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పాపిడి గూడెం మార్గం గుండా తెలంగాణలోకి టూ వీలర్ ద్వారా ఇంటింటికి వెళ్లి బియ్యాన్ని పట్టి అదే సరిహద్దు ప్రాంతమైన పాపిడి గూడెం మార్గం నుండి ఆంధ్ర వైపుగా జంగారెడ్డిగూడెం తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇట్టి విషయం గత కొన్నిల్లగా యదేచ్ఛగా కొనసాగుతున్న వ్యాపారస్తులు మాత్రం తగ్గేది లేదంటూ నిత్యం రవాణా యదేచ్ఛగా కొనసాగిస్తున్నారని తేటతెల్లమవుతుంది.

## కిలో బియ్యం 16 రూపాయల నుండి 20 రూపాయల వరకు విక్రయాలు

కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వటంతో ఒక్కొక్క వ్యక్తికి 6 కిలోల చొప్పున ఒక్కో కుటుంబానికి రెండు నుంచి నాలుగు క్వింటాల రైస్ తీసుకోవడం ఇళ్లల్లోనే నిల్వలు పెరిగిపోవడంతో చేసేదేమీ లేక పాడైపోతాయని భయంతో కొందరు ఆంధ్ర వ్యాపారస్తులకు కిలో 16 రూపాయల నుండి 20 రూపాయల మేరకు విక్రయాలు జరిపిస్తున్నట్లు పట్టణంలో భారీ స్థాయిలో ప్రచారం కొనసాగుతుంది. అంతేకాకుండా ఆంధ్ర వ్యాపారస్తులకు మీడియా మిత్రులతో పాటు కొందరు అధికారుల సహకారాలు కూడా పుష్కలంగా అందుతున్నాయని భారీగా ప్రచారం కొనసాగుతుంది.

## జాడ లేని సివిల్ సప్లై అధికారి యంత్రాంగం!

పేట పట్టణంలో జరుగుతున్న సర్కా ర్ రైస్ దందా ను అరికట్టాల్సిన సివిల్ సప్లై అధికారి యంత్రాంగం మాత్రం జాడ లేదని చెప్పుకోవచ్చు. జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలోని సివిల్ సప్లై విభాగం ఉన్నప్పటికీ కేవలం కేవలం ఆఫీసుకు పరిమితమయ్యారే తప్ప గ్రామాలలో అక్రమ బియ్యం రవాణా పై నిఘ పెట్టి నిలుపుదల చేస్తే మార్గదర్శకాలు అన్వేషిస్తారా! లేక వదిలేస్తారా! వేచి చూడాలి!

## పట్టపగలే యదేచ్ఛగా బియ్యం విక్రయాలు?

పట్టణంలోని నిరుపేదలు రేషన్ బియ్యం తీసుకున్న పెమట ఆంధ్ర వ్యాపారస్తులు మార్గమధ్యలోనే నిలబడి బియ్యం కొనుగోలు చేయటం సర్వసాధారణం అవుతుంది. ఒకపక్క కటికి నిరుపేదలకు సర్కార్ రైస్ ఎంతో ఉపయోగపడుతున్నప్పటికీ మరి కొంత మంది మాత్రం వాటిని దుర్వినియో గం పరిచేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటువంటి విధానానికి వ్యాపారస్తులు ముందుగానే వినియోగదారులకు పెట్టుబడి రూపంలో కొంత నగదును కూడా ఇస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా తెలంగాణ బియ్యం ఆంధ్రకి ప్రయాణం అన్నట్లుగా కొనసాగుతున్న వ్యాపారంపై సంబంధిత శాఖ గాఢ నిద్ర వీడి వ్యాపారస్తులపై నిఘా పెట్టి అక్రమాల నిర్మూలించేందుకు ప్రయత్నిస్తారా! లేక గాలికి వదిలేస్తారా! వేచి చూడాలి మరి!

# లక్షలతో నిర్మించారు లక్షణంగా వదిలేశారు

- నిరుపయోగంగా దోమకొండ బస్టాండ్ మరుగుదొడ్లు
- గడికోట ట్రస్ట్ విరాళం వృధా



**ప్రజావాయిస్ దోమకొండ**/లక్షల రూపాయల నిధులతో నిర్మించారు. లక్షణంగా వదిలేశారు. ఇది పాత తాలూకా కేంద్రమైన దోమకొండ బస్టాండ్ లో మరుగుదొడ్ల దుస్థితి.దోమకొండ గడికోట ట్రస్ట్ విలేజ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయలతో 2020లో దోమకొండ బస్టాండ్ లో మరుగుదొడ్లు నిర్మించారు. మంగళాదిమంది ప్రయాణించే దోమకొండ బస్టాండులో మరుగుదొడ్లకు,మూత్రశాలలకు ఇబ్బందువుతుందని నిర్మించారు. మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దోమకొండ గడికోట ట్రస్ట్ విలేజ్ డెవలప్మెంట్ సంస్థ విరాళంతో బస్టాండ్ లో లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించారు. ఈ సామాజిక మరుగుదొడ్లు సుమారు 18 వేల జనాభా ఉండి,అత్యధిక రాకపోకలు కలిగిన దోమకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్మించారు. ప్రతిరోజు ఈ బస్టాండ్ నుండివిద్యార్థిని విద్యార్థులు వందల సంఖ్యలో కామారెడ్డి, బిబిపేట ,పెద్ద మల్లారెడ్డి, బిక్కనూరు, మాచారెడ్డి, పాల్వంచ తదితర ప్రాంతాలకు ఉన్నత చదువుల కోసం వెళ్తారు. కామారెడ్డి నియోజకవర్గంలోని అత్యధిక జనాభా కలిగిన పట్టణం, కామారెడ్డి జిల్లాలోని అతిపెద్ద గ్రామపంచాయతీ దోమకొండ.2020లో అక్టోబర్ 14న ఆనాటి ప్రభుత్వ విప్ కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఈ సామాజిక మరుగుదొడ్లను ప్రారంభించారు. సామాజిక మరుగుదొడ్లకు గడి కోట ట్రస్ట్ లక్షలది రూపాయలను విరాళంగా అందజేసింది. బయో టాయిలెట్ ఆధునిక పద్ధతిలో నిర్మించింది. ఈ సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి అప్పటి జిపి పాలకవర్గం పలుమార్లు వ్యతిరేకించి జాప్యానికి కారణమైంది.ఈ బస్టాండ్ లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పెట్రోల్ పంపు కూడా మంజూరు చేసింది. 20 లక్షల నిధులను కూడా కేటాయించింది. గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వకపోవడంతో 20 లక్షల రూపాయల పెట్రోల్ పంపు నిధులు, పంపు నిర్మాణం రద్దు అయ్యాయి. దోమకొండ తో పాటు భిక్కనూరులో బస్టాండులో నిర్మించిన పెట్రోల్ పంపు విజయవంతంగా లాభాలలో నడుస్తుండగా దోమకొండ బస్టాండులో స్థలం ఉండగా పెట్రోల్ పంపు నిర్మాణానికి నోచుకోలేదు.ప్రైవేటు సంస్థ లక్షలాది రూపాయల విరాళంతో నిర్మించిన మరుగుదొడ్లు కూడా శిథిలావస్థకు చేరాయి. దర్వాజాలు ఎత్తుకుపోయారు. నీటి వసతి లేకపోవడంతో కూడా మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ సామాజిక మరుగుదొడ్లు బయో టాయిలెట్ పద్ధతిలో గడికోట ట్రస్ట్ విరాళంతో నిర్మించారు. కొద్దిరోజులు బాగానే పనిచేశాయి. ఆధునిక మరుగుదొడ్లు కొన్ని మాసాలుగా నిరుపయోగంగా శిథిలావస్థ దశకు చేరుకుంది. పాత తాలూకా కేంద్రంలో ఎంతో అవసరం ఉన్న ఈ బస్టాండ్ మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు విద్యార్థిని విద్యార్థులు వివిధ గ్రామాల నుండి దోమకొండకు రాకపోకలు సాగించే ప్రజలు కోరుతున్నారు.నీటి వసతి కల్పించి ఈ బయోటాయిలెట్ పద్ధతిలో ఆధునిక రీతిలో నిర్మించిన మరుగుదొడ్లను ఉపయోగం లోకి తీసుకురావాలని దోమకొండ పట్టణ ప్రజలు విద్యార్థిని విద్యార్థులు వివిధ గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.మహిళల గౌరవాన్ని పరిరక్షించే మరుగుదొడ్లను నిరుపయోగం నుండి ఉపయోగం లోకి తీసుకురావాలని కోరుతున్నారు.ఆర్టీసీ అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు ఈ సామాజిక మరుగుదొడ్లను ప్రజలు మహిళలు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు!

- మండల, డివిజన్ కేంద్రాల్లో యథాతథం
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**జా వాయిస్ ఖమ్మం:** ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేడు సోమవారం నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలనా కారణాల రీత్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు ఈ మార్పును గమనించాలని సూచించారు.జిల్లా స్థాయి కార్యక్రమం మాత్రమే రద్దయిందని, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేడు మధ్యాహ్నం 1:00 గంట వరకు ఆయా మండల, డివిజన్ స్థాయి కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.



# మహనీయుల విగ్రహాల వద్ద ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలి

## ఎస్సై జె నరేష్ కుమార్ కు వినతిపత్రం అందజేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

ప్రజా వాయిస్.. వీపనగండ్లవీపనగండ్ల గ్రామంలోని మహనీయుల విగ్రహాలకు అడ్డుగా వివిధ రకాల బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వీపనగండ్ల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆదివారం వీపనగండ్ల ఎస్సై జె. నరేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాల వద్ద అనధికారికంగా బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల విగ్రహాలకు ఇబ్బంది కలుగుతోందని ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు.అందుకు ఎస్సై నరేష్ కుమార్ స్పందిస్తూ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కొంత సమన్వయంతో వ్యవహరించాలని, త్వరలోనే సమస్యను పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహనీయుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వారి విగ్రహాలకు ఇబ్బంది కలిగించినా ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే యువజన సంఘం సభ్యులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పెద్దలు యువకులు తదితరులు ఉన్నారు

# హిమగిరినగర్‌కు నీటి శాపం




- కలుషిత నీటిపై ఫిర్యాదు చేస్తే - నీళ్లే బంద్
- 20 రోజులుగా తాగునీటి కోసం జనం తిప్పలు
- ఫిర్యాదులపై అధికారుల మౌనం

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:** జంట జలాశయాలను పక్కనే పెట్టుకుని గుక్కెడు నీటి కోసం జనాలు అల్లాడుతుంటే జలమండలి అధికారులు మాత్రం వారి సమస్యలను బుట్ట దాఖలు చేస్తున్నారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతుంటే, మరోవైపు సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌షాకోట్ డివిజన్ హిమగిరినగర్‌లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గతంలో సరఫరా అయిన నీరు మురుగునీటితో కలిసి కలుషితంగా వస్తుండటంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.అయితే సమస్యను సరిచేయాల్సిన చోట సరఫరానే నిలిచిపోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 20 రోజులుగా నల్లాలు మూగబోయాయి

హిమగిరినగర్‌లో సుమారు 20 రోజులుగా సక్రమంగా తాగునీటి సరఫరా లేదని స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ నెలలో నాలుగైదు రోజులు మాత్రమే నీరు వచ్చేదని, ప్రస్తుతం ఆ కొద్దిపాటి సరఫరా కూడా నిలిచిపోయిందని వాపోతున్నారు. తాగునీటితో పాటు రోజువారీ అవసరాల కోసం కూడా బయట నుంచి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్ల ద్వారా నీటిని సమకూర్చుకునే పరిస్థితి కూడా లేదని,దీంతో జలమండలి సరఫరాపైనే ఆధారపడాల్సి వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

## కలుషిత నీటిపై ఫిర్యాదు' ఆ తర్వాత సరఫరా బంద్?

గతంలో వచ్చిన నీటిలో మురుగునీరు కలిసివస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.తాగునీటి పైప్‌లైన్‌లోకి డ్రైనేజీ నీరు చేరుతోందనే అనుమానంతో జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు.పైప్‌లైన్ లీకేజీనా.? డ్రైనేజీ క్రాస్ కనెక్షనా.? సాంకేతిక లోపమా.? అన్నది పరిశీలించి సమస్యను పరిష్కరించాల్సి ఉండగా, ఆ తర్వాత నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.కలుషిత నీటిని సరఫరా చేయడం ఒక సమస్య అయితే,సమస్యను సరిచేయకుండా సరఫరాను నిలిపివేయడం మరో సమస్యగా మారిందని వారు అంటున్నారు.

## బిల్లులు మాత్రం క్రమం తప్పకుండా

ఇళ్లకు నల్లా కనెక్షన్లు,నీటి మీటర్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా సక్రమంగా లేదని స్థానికులు చెబుతున్నారు. నీరు అందకపోయినా ప్రతి నెలా నీటి బిల్లులు మాత్రం క్రమం తప్పకుండా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బిల్లులు వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ,నీటి సరఫరా పునరుద్ధరణలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

## ఫిర్యాదులే,పరిష్కారం లేదు

నీటి సమస్యపై కిస్మత్‌పూర్ సెక్షన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు.ఫిర్యాదులు నమోదు చేయడం కాకుండా సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# గుంతల మయంగా కిన్నెరసాని వెళ్ళు ప్రధాన రహదారి

- గుంతలతో నిత్యం కిన్నెరసాని పర్యటకులకు తీవ్ర ఇబ్బందులు
- భద్రాద్రి జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ అధికారుల జాడ ఎక్కడ..!!
- హెల్మెట్ ధరించకపోతే ఫోటోలు చలాన్లు కాదు... ఓవర్ లోడ్ బూడిద లారీలపై చర్యలు శూన్యమ..!!
- అయ్యా జిల్లా కలెక్టర్ ప్రజల ప్రాణాలు పోయే వరకు చూస్తారా.
- తక్షణమే కిన్నెరసాని వెళ్ళు రహదారులను మరమ్మత్తులు చెయ్యాలంటున్న స్థానికులు.



**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలో ఉన్న కిన్నెరసాని ప్రాజెక్ట్ రాష్ట్రంలోనే పర్యటక ప్రదేశాల్లో ఇది కూడా ఒక అద్భుతమైన గుర్తింపు కలిగిన ఉన్న ప్రదేశం. ఇటువంటి పర్యటక ప్రాంతానికి వెళ్ళు ప్రధాన రహదారులు నిత్యం ఓవర్లోడ్ బూడిద లారీలతో దర్శనమిస్తున్నాయి. నిత్యం ఆదివారాలు కిన్నెరసాని ప్రాజెక్టు అలాగే పార్క్ వంటి ప్రాంతానికి పర్యటించేందుకు పర్యటకులు వెళ్లేందుకు కిన్నెరసాని రహదారి అల్లూరి సెంటర్ నుండి కిన్నెరసాని ప్రాజెక్టు వరకు దారులు ఎక్కడికక్కడ గుంతల మయంగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ముఖ్యంగా కేటీపీఎస్ ఏడవ దశ ముఖ ద్వారం నుండి వచ్చే బూడిద లారీలు ఇతరత్రా లారీల రాగడ పోగడకు నలిగి రోడ్డు తీవ్రంగా పాడైపోతున్న అటు కేటిపిఎస్ అధికారులు ఇటు ఆర్ అండ్ బి శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ముఖ్యంగా కేటీపీఎస్ ప్లాంట్ కు వెళ్ళు దారి దగ్గర సుమారుగా రోడ్డు మధ్య వరకు అతిపెద్ద గుంత గా మారి మురికి నీటితో రోడ్డు మధ్యలో చెరువును తలపించే విధంగా నిత్యం దర్శనమిస్తున్నాయే తప్ప ఏమాత్రం వాటి మరమ్మత్తులు చేపించే నాధుడే కరువయ్యారంటూ స్థానికులు తెలియజేస్తున్నారు. అంతేకాకుండా పాల్వంచ మండల రూరల్ పోలీస్ స్టేషన్ కు వెళ్లాలి అన్న ఇదే ప్రధాన రహదారి అయినా కూడా వారు ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించకపోతే ఫోటోలు తీసి చలాన్లు వేస్తున్నారే తప్ప ఓవర్ లోడ్ బూడిదతో వెళుతున్న లారీలపై ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదంటూ స్థానిక ప్రజలు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. ఈ విధంగా రోడ్లపై చెరువులను తలపించే విధంగా గుంతలు దర్శనమిస్తున్న కూడా సంబంధిత శాఖ అధికారుల మౌనం వాహనదారుల ప్రాణాలను బలి కోరుకుంటుంది ఏమో అంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు.కావున ఇకనైనా స్థానిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఇకనైనా తక్షణమే స్పందించి ఆర్ అండ్ బి శాఖ అధికారులతో మరియు కేటీపీఎస్ ప్లాంట్ అధికారులతో సమీక్షించి తక్షణమే కిన్నెరసాని పర్యాటక ప్రాంత దారులను మరమ్మత్తులు చేపించవలసిందిగా స్థానికులు వేడుకుంటున్నారు.



## గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి

**హాలియాలో గణేష్ మండపం దర్శనం.. ప్రత్యేక పూజలు**

**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ**

**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష**

**ప్రజా వాయిస్,హాలియా:**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హాలియా మున్సిపాలిటీ 6వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి దర్శించుకున్నారు. సీకే యువజన సంఘం ఆహ్వానం మేరకు మండపానికి చేరుకున్న ఆయన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని, ఇలాంటి కార్యక్రమాలు భక్తిభావంతో పాటు సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఎమ్మెల్సీ అభినందించారు. ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అన్నేపాక శ్రీనివాస్, మాజీ హాలియా పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, మాజీ బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు సైదాచారి, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి దోరెపల్లి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు గంగా భవాని, మాజీ ఎంపీటీసీ గడ్డం రమణయ్య, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సీకే యువజన సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## బాధ్యతతో క్రీడలు నిర్వహించాలి

**- త్రో బాల్ పోటీల నిర్వాహకులకు రాష్ట్ర అసోసియేషన్ స్పష్టమైన సూచనలు**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
క్రీడాకారుల పట్ల నిర్వాహకులు పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ, పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి. కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం వికారాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాల్లో నిర్వహించే త్రో బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వసతి, భోజనం, రవాణా తదితర సౌకర్యాల బాధ్యతను నిర్వాహకులు సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. క్రీడాకారుల సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీకి తావు ఉండకూడదన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించినప్పుడే వారు పోటీలపై పూర్తి దృష్టి సారించి ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. త్రో బాల్ అభివృద్ధికి రాష్ట్ర కమిటీ తరఫున అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎన్. పూర్ణచంద్రరావు, కోశాధికారి షేక్ జమీల్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీధర్, నాయకులు పద్మగౌడ్, ప్రవీణ్ చారి, పూలేందర్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో అన్నదానం.. ట్యాంక్‌నగర్‌లో ఆధ్యాత్మిక సందడి

**విఘ్నేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు**

**భక్తులు, స్థానికులకు అన్న ప్రసాద వితరణ**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్థులు, భక్తులు**

**కార్యక్రమాన్ని అభినందించిన పోలీసు అధికారులు**

**ప్రజా వాయిస్,తుర్కపల్లి:**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని ట్యాంక్‌నగర్ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, స్థానికులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, ఎస్సై శివకృష్ణ, పాత్రికేయులు మహేష్, కొత్తింటి సురేష్ పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. పోలీసు అధికారులు నిర్వాహకులను అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం కొనసాగేందుకు స్థానికులు సహకరించారు. అన్నదానం మహాదానం అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.



## అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ అండ

**ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో రూ.3.88 లక్షల సాయం**

**10 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నేత పైళ్ల సోమిరెడ్డి**

**వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఊరట**

**ప్రజా వాయిస్,మోత్కూరు:**
అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి అన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.3,88,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం మోత్కూరులో 10 మంది లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు గుంటి అనూష ఉపేందర్‌కు రూ.26 వేలు, కనుకు ధనలక్ష్మి నాగరాజు కుటుంబానికి రూ.28,500, మరో లబ్ధిదారుకు రూ.20 వేలు, షేక్ రాఫీత్‌కు రూ.18 వేలు, దేవర మధుకు రూ.90 వేలు, జిట్టా పద్మకు రూ.20 వేలు, ఎల్లంల మల్లమ్మకు రూ.20 వేలు, పగిడిపల్లి రాములుకు రూ.36 వేలు, నర్రె శ్రీశైలానికి రూ.30 వేలు, గిరకత్తుల శోభన్‌బాబుకు రూ.1 లక్ష చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో మోత్కూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్నగౌడ్, బీసు శ్రీకాంత్‌గౌడ్, మెంట రమణ నగేష్, కురుమళ్ల ప్రమీల రాములు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ టౌన్ అధ్యక్షుడు అవిశెట్టి మధు, నాయకులు బొల్లెపల్లి శ్రావణ్, బీసు రాహుల్, బీసు వెంకటేష్, యోగానందం తదితరులు పాల్గొన్నారు.



## కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి

**సాగు పనుల్లో రైతుకు తీరని నష్టం**

**కళ్లెదుటే మూగజీవి మృత్యువాత**

**రూ.లక్షల్లో నష్టం.. పరిహారం అందించాలని వేడుకోలు**

**ప్రజా వాయిస్,మోటకొండూరు:**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కొండాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి (సత్తిరెడ్డి)కి చెందిన ఎద్దు ఆదివారం ఉదయం 7.27 గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సాగు పనుల్లో కీలకంగా ఉపయోగపడే ఎద్దు కళ్లెదుటే మృత్యువాత పడటంతో రైతు శ్రీనివాస్‌రెడ్డి కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో రైతు కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. ప్రమాదానికి కారణమైన పరిస్థితులపై విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి, బాధిత రైతుకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు, తోటి రైతులు కోరుతున్నారు.

# ప్రార్థన మందిరం వద్ద రణరంగం

**ఖానాపూర్‌లో ఉద్రిక్తత**

**కుర్చీలు,కర్రలతో ఇరువర్గాల దాడులు**

**పలువురికి గాయాలు**

**లాఠీచార్జ్‌తో చెదరగొట్టిన పోలీసులు**







కుర్చీలు,కర్రలతో పరస్పర దాడులు చేసుకుంటున్న చిత్రం



ఇరు వర్గాలను లాటిఛార్జ్ చేసి చదరగొడుతున్న పోలీసులు





**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**
నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్‌లో ప్రార్థన మందిరం వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రార్థనలు జరుగుతున్న సమయంలో తలెత్తిన వివాదం కాస్తా పరస్పర దాడులకు దారితీసింది. కుర్చీలు,కర్రలతో ఇరువర్గాలు దాడులకు దిగడంతో పలువురికి గాయాలైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఘటన నేపథ్యంలో ఖానాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

**చర్చి స్థలం - కమిటీ వివాదమే కారణమా?**
ఖానాపూర్‌లోని బాప్టిస్ట్ చర్చి నిర్వహణ,స్థలానికి సంబంధించిన అంశంపై కొంతకాలంగా ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతున్నట్లు సమాచారం. 1991లో నారాయణగూడ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో ప్రార్థన మందిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. అయితే చర్చి స్థలం విషయంలో ఓ వర్గం జోక్యం చేసుకుంటోందని మరో వర్గం ఆరోపిస్తోంది. 2018లో తమకు తెలియకుండా కొత్త కమిటీ ఏర్పాటు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటీవల కొత్త కమిటీ అంశం తెరపైకి రావడం,చర్చి స్థలంలో బోర్డు ఏర్పాటు చేసే ప్రయత్నం జరగడం,దీనిని మరో వర్గం అడ్డుకోవడంతో వివాదం మరింత ముదిరినట్లు తెలుస్తోంది.

**గతంలోనూ పోలీసులకు ఫిర్యాదులు**
చర్చి స్థలం,నిర్వహణ కమిటీ అంశాలపై ఇరువర్గాలు గతంలోనూ నార్సింగి పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ మేరకు కేసులు నమోదు చేసి ఇరువర్గాలను పోలీసులు హెచ్చరించినట్లు తెలిసింది. అయినప్పటికీ తాజాగా మరోసారి ఘర్షణ చోటుచేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. ప్రస్తుతం పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఘర్షణకు దారితీసిన పూర్తి కారణాలు,గాయపడిన వారి వివరాలు,కేసుల వివరాలపై పోలీసుల నుంచి అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

# ఇన్రోజీవాడి..ఒక ఎర్రజ్ఞాపకం.!

**నాలుగు దశాబ్దాల మావోయిస్టు ప్రస్థానానికి వేదికైన గ్రామం**

**లోకేటి చందర్ అంతిమయాత్రకు వేలాదిగా తరలివచ్చిన మాజీలు, అభిమానులు**

**ఎర్రజెండాలు.. విప్లవ గీతాలు.. నినాదాలతో మార్మోగిన పల్లె**

**నేటికీ చెరగని చందర్ జ్ఞాపకాలు..**

**కొనసాగుతున్న పోలీసుల నిఘా**









**ప్రజావాయిస్ ,కామారెడ్డి ప్రతినిధి :**
ఒక చిన్న పల్లె.. కానీ నాలుగు దశాబ్దాల ఉద్యమ చరిత్రకు సాక్ష్యం. ఎర్రజెండా ఉద్యమంలో కీలకంగా నిలిచిన మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు లోకేటి చందర్ అలియాస్ పడకల్ స్వామి అలియాస్ ప్రభాకర్ స్వగ్రామం ఇస్రోజీవాడి. ఒకప్పుడు అజ్ఞాతంలో సాగిన ఆయన ప్రస్థానం.. చివరికి స్వగ్రామానికి భౌతికకాయంగా చేరిన రోజు ఈ పల్లె మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. వేలాది మంది మాజీ నక్సలైట్లు, అభిమానులు, బంధువులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొనడంతో గ్రామం జనసంద్రంగా మారింది.

**ఆ రోజు.. పల్లెకు వెల్లువలా జనం**
మహారాష్ట్రలోని గడ్చిరోలి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లోకేటి చందర్ మృతి చెందిన అనంతరం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఇస్రోజీవాడికి తీసుకొచ్చారు. ఉత్తర తెలంగాణ జిల్లాలు, హైదరాబాద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. మాజీ నక్సలైట్లు, సహచరులు, అభిమానులు, బంధువులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎర్రజెండాలు, విప్లవ గీతాలు, నినాదాలతో గ్రామం మార్మోగింది. చందర్‌తో కలిసి పనిచేసిన మాజీ సహచరులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఉద్యమంలో ఆయన సాగించిన ప్రస్థానాన్ని పాటల రూపంలో ఆలపించారు.

**నిఘా నీడలో అంతిమయాత్ర**
భారీగా జనసమీకరణ నేపథ్యంలో పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. మఫ్టీలో సిబ్బందిని మోహరించి పరిస్థితులను పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమాలను వీడియో చిత్రీకరించడంతోపాటు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పోలీసుల నిఘా ఇప్పటికీ కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు.

గోడలపై జ్ఞాపకాలు.. ఫ్లెక్సీల్లో ప్రస్థానం
అమరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చందర్ చిన్ననాటి ఫొటోలతోపాటు ఆయన ఉద్యమ జీవితానికి సంబంధించిన వివిధ ఘట్టాలను ప్రదర్శించారు. వాటిని చూసేందుకు వచ్చిన వారు ఆయన జీవితంలోని పలు దశలను గుర్తుచేసుకున్నారు. మద్దికుంట, పడకల్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లు, అప్పటి పరిణామాలను మాజీ సహచరులు ప్రస్తావించారు. దండకారణ్యంలో ఆదివాసీల సమస్యలపై జరిగిన పోరాటాలు, గడ్చిరోలి ప్రాంతంలోని ఉద్యమ పరిణామాలను వారు గుర్తుచేశారు.

**'గెరిల్లా అక్క'గా సులోచన**
చందర్ భార్య సులోచన ప్రస్తావన కూడా కార్యక్రమంలో ప్రత్యేకంగా వచ్చింది. దండకారణ్యం, గడ్చిరోలి ప్రాంతాల్లో ఆమె గడిపిన కాలం, ఉద్యమ సమయంలో ఎదురైన అనుభవాలను పలువురు గుర్తుచేశారు. ఆమె జ్ఞాపకాలను 'గెరిల్లా అక్క' పేరుతో పుస్తకంగా తీసుకురావడంపై కుటుంబ సభ్యులు, మాజీ సహచరులు చర్చించుకున్నారు.

**కన్నీటి పర్యంతమైన రమేశ్**
తండ్రి చందర్, తల్లి సులోచన ఉద్యమ జీవితంలో ఎదుర్కొన్న నిర్బంధాలు, కుటుంబం పడిన ఇబ్బందులను కుమారుడు రమేశ్ గుర్తుచేసుకున్నారు. తీవ్రమైన పోలీసు నిఘా కారణంగా చిన్ననాట తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులను వివరిస్తూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. రమేశ్ ప్రసంగంతో అక్కడి వాతావరణం విషాదంగా మారింది.

**నాలుగు దశాబ్దాల ప్రస్థానం**
1980ల నుంచి 2025 వరకు సాగిన తన రాజకీయ,ఉద్యమ జీవితంలో లోకేటి చందర్ పలు ప్రాంతాల్లో పనిచేసినట్లు మాజీ సహచరులు తెలిపారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను వారు గుర్తుచేశారు. కామారెడ్డి మాజీ దళ నాయకుడు గంగన్న అలియాస్ మల్లేశ్‌యాదవ్ తదితరులు అప్పటి ఘటనలను వివరించారు. చందర్ భౌతికకాయాన్ని పాత ఇంటి స్థలంలో ఉంచడం, అనంతరం సొంత పొలంలో కుటుంబ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించిన విషయాలను వారు గుర్తుచేశారు. ఒకప్పుడు ఉద్యమ ప్రస్థానానికి వేదిక.. ఆ తర్వాత ఓ అంతిమయాత్రకు సాక్ష్యం..లోకేటి చందర్ జ్ఞాపకాలతో ఇస్రోజీవాడి పేరు మాత్రం ఆ ప్రాంత చరిత్రలో చెరగని ముద్ర వేసింది.


ప్రజావాయిస్ ,కామారెడ్డి ప్రతినిధి :
ఒక చిన్న పల్లె.. కానీ నాలుగు దశాబ్దాల ఉద్యమ చరిత్రకు సాక్ష్యం. ఎర్రజెండా ఉద్యమంలో కీలకంగా నిలిచిన మాజీ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు లోకేటి చందర్ అలియాస్ పడకల్ స్వామి అలియాస్ ప్రభాకర్ స్వగ్రామం ఇస్రోజీవాడి. ఒకప్పుడు అజ్ఞాతంలో సాగిన ఆయన ప్రస్థానం.. చివరికి స్వగ్రామానికి భౌతికకాయంగా చేరిన రోజు ఈ పల్లె మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. వేలాది మంది మాజీ నక్సలైట్లు, అభిమానులు, బంధువులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొనడంతో గ్రామం జనసంద్రంగా మారింది.
ఆ రోజు.. పల్లెకు వెల్లువలా జనం
మహారాష్ట్రలోని గడ్చిరోలి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లోకేటి చందర్ మృతి చెందిన అనంతరం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఇస్రోజీవాడికి తీసుకొచ్చారు. ఉత్తర తెలంగాణ జిల్లాలు, హైదరాబాద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. మాజీ నక్సలైట్లు, సహచరులు, అభిమానులు, బంధువులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎర్రజెండాలు, విప్లవ గీతాలు, నినాదాలతో గ్రామం మార్మోగింది. చందర్‌తో కలిసి పనిచేసిన మాజీ సహచరులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఉద్యమంలో ఆయన సాగించిన ప్రస్థానాన్ని పాటల రూపంలో ఆలపించారు.
నిఘా నీడలో అంతిమయాత్ర
భారీగా జనసమీకరణ నేపథ్యంలో పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. మఫ్టీలో సిబ్బందిని మోహరించి పరిస్థితులను పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమాలను వీడియో చిత్రీకరించడంతోపాటు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పోలీసుల నిఘా ఇప్పటికీ కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు.
గోడలపై జ్ఞాపకాలు.. ఫ్లెక్సీల్లో ప్రస్థానం
అమరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చందర్ చిన్ననాటి ఫొటోలతోపాటు ఆయన ఉద్యమ జీవితానికి సంబంధించిన వివిధ ఘట్టాలను ప్రదర్శించారు. వాటిని చూసేందుకు వచ్చిన వారు ఆయన జీవితంలోని పలు దశలను గుర్తుచేసుకున్నారు. మద్దికుంట, పడకల్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లు, అప్పటి పరిణామాలను మాజీ సహచరులు ప్రస్తావించారు. దండకారణ్యంలో ఆదివాసీల సమస్యలపై జరిగిన పోరాటాలు, గడ్చిరోలి ప్రాంతంలోని ఉద్యమ పరిణామాలను వారు గుర్తుచేశారు.
'గెరిల్లా అక్క'గా సులోచన
చందర్ భార్య సులోచన ప్రస్తావన కూడా కార్యక్రమంలో ప్రత్యేకంగా వచ్చింది. దండకారణ్యం, గడ్చిరోలి ప్రాంతాల్లో ఆమె గడిపిన కాలం, ఉద్యమ సమయంలో ఎదురైన అనుభవాలను పలువురు గుర్తుచేశారు. ఆమె జ్ఞాపకాలను 'గెరిల్లా అక్క' పేరుతో పుస్తకంగా తీసుకురావడంపై కుటుంబ సభ్యులు, మాజీ సహచరులు చర్చించుకున్నారు.
కన్నీటి పర్యంతమైన రమేశ్
తండ్రి చందర్, తల్లి సులోచన ఉద్యమ జీవితంలో ఎదుర్కొన్న నిర్బంధాలు, కుటుంబం పడిన ఇబ్బందులను కుమారుడు రమేశ్ గుర్తుచేసుకున్నారు. తీవ్రమైన పోలీసు నిఘా కారణంగా చిన్ననాట తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులను వివరిస్తూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. రమేశ్ ప్రసంగంతో అక్కడి వాతావరణం విషాదంగా మారింది.
నాలుగు దశాబ్దాల ప్రస్థానం
1980ల నుంచి 2025 వరకు సాగిన తన రాజకీయ,ఉద్యమ జీవితంలో లోకేటి చందర్ పలు ప్రాంతాల్లో పనిచేసినట్లు మాజీ సహచరులు తెలిపారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను వారు గుర్తుచేశారు. కామారెడ్డి మాజీ దళ నాయకుడు గంగన్న అలియాస్ మల్లేశ్‌యాదవ్ తదితరులు అప్పటి ఘటనలను వివరించారు. చందర్ భౌతికకాయాన్ని పాత ఇంటి స్థలంలో ఉంచడం, అనంతరం సొంత పొలంలో కుటుంబ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించిన విషయాలను వారు గుర్తుచేశారు. ఒకప్పుడు ఉద్యమ ప్రస్థానానికి వేదిక.. ఆ తర్వాత ఓ అంతిమయాత్రకు సాక్ష్యం..లోకేటి చందర్ జ్ఞాపకాలతో ఇస్రోజీవాడి పేరు మాత్రం ఆ ప్రాంత చరిత్రలో చెరగని ముద్ర వేసింది.


# క్రషర్ మిల్లులో ప్రమాదం.. కార్మికుడి కాలు తొలగింపు

**బ్లాస్టింగ్ సమయంలో మీదపడ్డ రాళ్లు.. మరో కాలుకూ తీవ్ర గాయం**

**కుటుంబాన్ని పోషించే యజమాని ఆస్పత్రిపాలు..**

**దిక్కుతోచని స్థితిలో కుటుంబం**

**నామమాత్రపు చికిత్సతో చేతులు దులుపుకున్నారంటూ యాజమాన్యంపై ఆరోపణలు**

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ క్రషర్ మిల్లు వద్ద ధర్నా**

**ప్రజా వాయిస్,కొండమల్లేపల్లి:**
కుటుంబాన్ని పోషించే యజమాని క్రషర్ మిల్లులో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. చివరకు ఓ కాలును వైద్యులు తొలగించాల్సి రావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన కుంచపు గిరి(వెంకటయ్య కుమారుడు) విషయంలో చోటుచేసుకుంది. కొద్ది రోజుల క్రితం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్రకుమార్ నాయక్‌కు చెందినదిగా కుటుంబ సభ్యులు పేర్కొంటున్న క్రషర్ మిల్లులో బ్లాస్టింగ్ పనులు జరుగుతుండగా పైనుంచి రాళ్లు పడటంతో గిరి తీవ్రంగా గాయపడ్డాడు. ఒక కాలు నుజ్జునుజ్జు కాగా, మరో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కుడికాలు తీవ్రంగా దెబ్బతినడంతో వైద్యుల సూచన మేరకు దానిని తొలగించారు. మరో కాలుకు శస్త్రచికిత్స చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



**యాజమాన్యంపై కుటుంబ సభ్యుల ఆగ్రహం**
ప్రమాదం జరిగిన అనంతరం క్రషర్ మిల్లు యాజమాన్యం నామమాత్రపు చికిత్స అందించి చేతులు దులుపుకుందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. రెండు కాళ్లలో ఒకటి కోల్పోయి, మరో కాలుకు తీవ్ర గాయాలతో గిరి ఆస్పత్రిలో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుని న్యాయం చేయాలని కోరినా యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తోందని ఆరోపించారు.

**మిల్లు వద్ద ధర్నా**
బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు క్రషర్ మిల్లు వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. గిరి వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులోకుటుంబానికి అండగా నిలవాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.




# వార్త వెలుగులోకి..సమస్యకు పరిష్కారం

**ప్రజా వాయిస్ కథనంతో కదిలిన విద్యుత్ అధికారులు**

**అమీనాబాద్ ఒకటో వార్డులో చెట్ల కొమ్మల తొలగింపు**

**రెండు రోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ**

**అధికారులకు, ప్రజా వాయిస్ పత్రికకు వార్డు ప్రజల కృతజ్ఞతలు**

**ప్రజా వాయిస్,అనంతగిరి:**
విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలతో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమస్యపై 'ప్రజా వాయిస్'లో వచ్చిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామం ఒకటో వార్డులో విద్యుత్ అంతరాయంపై కథనం






ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం ఉదయం సిబ్బందితో కలిసి సమస్యాత్మక ప్రాంతానికి చేరుకుని విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించారు. అనంతరం విద్యుత్ లైన్‌ను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో రెండు రోజులుగా అంధకారంలో ఉన్న వార్డు ప్రజలకు ఊరట లభించింది. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి అధికారులు స్పందించేలా చేసిన 'ప్రజా వాయిస్'కు వార్డు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సకాలంలో స్పందించి చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన విద్యుత్ శాఖ అధికారులకు, సహకరించిన స్థల యజమానికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా వాయిస్ ఎఫెక్ట్



# జాబ్‌మేళాలో జీజేసీ విద్యార్థుల సత్తా

**14 మందికి ఆఫర్ లెటర్లు.. ఐదు దశల ఇంటర్వ్యూల్లో ప్రతిభ**

**మోత్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 30 మంది విద్యార్థుల హాజరు**

**ఎంపికైన విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్**

**ప్రజా వాయిస్, మోత్కూర్:**
కోదాడలో ఈ నెల 19న నిర్వహించిన జాబ్‌మేళాలో మోత్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనగా.. వివిధ రంగాల్లో నిర్వహించిన ఐదు దశల ఇంటర్వ్యూలను విజయవంతంగా పూర్తి చేసిన 14 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై ఆఫర్ లెటర్లు అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభపై కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి జాబ్‌మేళాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ ఇంటర్వ్యూలపై అవగాహన, అనుభవం లభిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో జరిగే ఇంటర్వ్యూలను ఎదుర్కొనేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





# కాంగ్రెస్ గ్రామ శాఖకు కొత్త కార్యవర్గం

**ముషిపట్ల అధ్యక్షుడిగా బుషిపాక రమేష్..**

**ఉపాధ్యక్షుడిగా కొల్లూరి మల్లయ్య**

**కార్యదర్శిగా మద కాశీం ఎన్నిక**

**ప్రజా వాయిస్,మోత్కూరు:**
మండల పరిధిలోని ముషిపట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుషిపాక రమేష్, ఉపాధ్యక్షుడిగా కొల్లూరి మల్లయ్య, కార్యదర్శిగా మద కాశీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుషిపాక రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనను గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకోవడంలో సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తండా సత్తయ్య, ఉప సర్పంచ్ నోముల అంజయ్య, కొల్లు రమేష్, చేవెళ్లి బీరయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్నానీపల్లి సందీప్, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణపయ్యను సాగనంపుతూ.. చిన్నారి కన్నీళ్లు

**మళ్లీ ఎప్పుడు వస్తాడంటూ తండ్రిని పట్టుకుని కంటతడి**

**ఏడు రోజుల అనుబంధానికి భావోద్వేగ వీడ్కోలు**

**నెక్నాంపూర్ వినాయక పాండ్ వద్ద కదిలించిన దృశ్యం**

**ప్రజా వాయిస్,రాజేంద్రనగర్:**
ఏడు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని నిమజ్జనానికి తరలించే వేళ ఓ చిన్నారి కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యం అందరినీ కదిలించింది. మణికొండ,నెక్నాంపూర్ వినాయక పాండ్ వద్ద ఆదివారం ఈ భావోద్వేగ ఘటన చోటుచేసుకుంది. తమకు ఇష్టమైన గణపయ్య గంగమ్మ ఒడికి చేరుతుండటంతో.. 'మళ్లీ ఎప్పుడు వస్తాడు?' అంటూ ఆ చిన్నారి తన తండ్రిని పట్టుకుని కంటతడి పెట్టింది. గణనాథుడి నిమజ్జనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి వందలాది మంది భక్తులు పాండ్ వద్దకు చేరుకున్నారు. ఒకవైపు నిమజ్జన వేడుకల సందడి, మరోవైపు డప్పుల మోత.. ఇంతలో గణపయ్యను సాగనంపలేక చిన్నారి కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఏడు రోజుల పాటు తమతో ఉన్న వినాయకుడికి వీడ్కోలు పలికే సమయంలో ఆ చిన్నారి చూపిన అమాయకపు అనుబంధం పలువురి హృదయాలను తాకింది.



# అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

**సర్పంచ్ మామిడి కీర్తి హరీష్**
**సర్దార్ నగర్ శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం**

**విఘ్నేశ్వరుని ఆశీస్సులతో సర్దార్ నగర్‌లో కన్నులపండువగా సాగిన భక్తి సమారాధన**



( ప్రజా వాయిస్ షాబాద్)
షాబాద్ మండలం సర్దార్ నగర్ గ్రామంలో శ్రీ వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బృహత్ అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ పుణ్యకార్యానికి స్థానిక సర్పంచ్ మామిడి కేర్తి హరీష్ మరియు ఉపసర్పంచ్ సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ముందుగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి దివ్య ఆశీస్సులు పొందిన అనంతరం సర్పంచ్ మామిడి కేర్తి హరీష్, ఉపసర్పంచ్ సురేష్‌లతో కలిసి వివేకానంద యూత్ సభ్యులు భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడమే నిజమైన ఆధ్యాత్మిక సేవ అని, అన్ని దానముల కంటే అన్నదానం ఎంతో శ్రేష్ఠమైనదని కొనియాడార గణనాథుడి కృపాకటాక్షాలతో సర్దార్ నగర్ గ్రామంలో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విలసిల్లాలని, గ్రామం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆధ్యాత్మిక ఉత్సవాలతో పాటు సామాజిక దృక్పథంతో అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించిన శ్రీ వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులను





ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు ఈ అన్నదాన కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ విజయలక్ష్మి, శ్రీ వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు బన్నీ గౌడ్, ఆనంద్, శ్రీకాంత్, రాజు, ఈశ్వర్, హర్షిత్, ప్రణీత్, సాయి, చరణ్, కృష్ణ, నరేష్, మహేష్, సాయి ప్రకాష్, ప్రశాంత్, గౌతమ్, శివ, కుమార్,గ్రామ పెద్దలు, మహిళలు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.



## శ్రీనగర్ కాలనీలో ఘనంగా గణేష్ నవరాత్రి మహా అన్నదానం

ప్రజా వాయిస్,కోదాడ:
పట్టణంలోని 17వ వార్డు శ్రీనగర్ కాలనీ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనగర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక కాలనీవాసులు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మల్లారెడ్డి, బత్తినేని హనుమంతరావు, శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మల్లికార్జున్, భూపతి రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నారప్ప రెడ్డి, వీరారెడ్డి, కొండలరావు, లక్ష్మయ్య, ప్రసాద్, ఎరుకల రెడ్డి, కొత్త రఘుపతి, వెంకటప్ప రెడ్డి, గణేష్ ఉత్సవ నిర్వహకులు, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తిశ్రద్ధలతో కాలనీలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షంవ్యక్తం చేశారు.

# బుద్ధారంలో నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన!

**లయన్స్ క్లబ్, భక్త రామదాసు సొసైటీ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం!**

**150 మందికి కంటి పరీక్షలు..**
**25 మందికి ఉచిత ఆపరేషన్లు!**

**వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించిన సర్పంచ్ మేళ్లచెరువు సత్యం**





ప్రజా వాయిస్ ఖమ్మం:
లయన్స్ కంటి ఆసుపత్రి వైరా, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని బుద్ధారం గ్రామంలోఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మేళ్లచెరువు సత్యం రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐ క్యాంప్ చైర్మన్ గెల్లా జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా భక్త రామదాసు సర్వీస్ సొసైటీ, లయన్స్ ఆసుపత్రి సమన్వయంతో ఉచిత శిబిరాలు నిర్వహిస్తూ ఎంతోమంది పేదలకు దృష్టిని



ప్రసాదిస్తున్నాయని పేర్కొన్నారు. శిబిరంలో సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సేవా దృక్పథంతో సహకరిస్తున్న లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, వైద్య సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పచ్చా తిరుపతయ్య, కార్యదర్శి గెల్లా వెంకటరమణ గుప్తా, కోశాధికారి దండా రవీంద్ర బాబు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గంజికుంట్ల వెంకన్న, తెల్లగొర్ల లింగస్వామి, కె.వెంకటాచారి పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, నాయకులు అరేకట్ల గురవయ్య, అరేకట్ల కొండలరావు, సామినేని వాసు, కాకాని ధనమూర్తి, మాజీ అధ్యక్షులు వేటుకూరి వెంకటరామారావు, యలమద్ది లెనిన్, పొన్నగని శ్రీనివాసరావు, కె.దేవిప్రసాద్, బి.నాగేశ్వరరావు, దేవరాశెట్టి లక్ష్మణ్ రావు, ఎర్ర సైదయ్య, కొత్త వేణు, రేలా నర్సింహారెడ్డి, మందడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఖమ్మంలో జరగు అఖిల భారత రైతు కూలీ సంఘం 4వజాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజా వాయిస్ కొత్తగూడ
బహిరంగ సభ కరపత్రాల ఆవిష్కరణ.అఖిలభారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది, అనంతరం బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా మండల వెంకన్న సిపిఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయకరంగాన్ని దివాలా తీపించి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయకరంగాన్ని బౌల జాతి కంపెనీలకు అంబానీ ఆదానీలకు కట్టబెడుతుంది. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని యూరియా యాప్ ను రద్దు చేయాలని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రజా పోరాటంలో భాగస్వాములు కావాలని అందులో భాగంగానే ఖమ్మంలోజరుగు అఖిలభాత రైతుకూలీ సంఘం జాతీయ మహాసభలు జరుగుతున్నాయి ఈ మహాసభలకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రావాలనివారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కామ్రేడ్ సూర్యం, బుర్కా వెంకటయ్య, పుల్లన్న,శ్రీశైలం, నర్సక్క నిర్మల, పూర్ణచందర్, సోమయ్య, దేవేందర్, ప్రభాకర్, సత్యం, సువర్ణపాక నర్సయ్య, మంగన్న, జామ్లా, వెంకన్న,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో టేక్మాల్ మండల బీజేపీ నేతలకు కీలక పదవులు

**-మెదక్ జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్..**
**-సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యునిగా వడ్డే రాములు..**



ప్రజా వాయిస్ టేక్మాల్:
టేక్మాల్ మండలానికి చెందిన బీజేపీ నాయకులకు ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా కీలక బాధ్యతలు దక్కాయి. మెదక్ జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మోహన్ నాయక్, సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా వడ్డే రాములు నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోహన్ నాయక్, వడ్డే రాములును మెదక్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్ నాయికోటి శ్యామయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలు పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాయికోటి శ్యామయ్య మాట్లాడుతూ టేక్మాల్ మండలానికి చెందిన నాయకులకు ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా బాధ్యతలు రావడం సంతోషకరమైన విషయమన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, మండలంలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.నూతనంగా నియమితులైన మోహన్ నాయక్, వడ్డే రాములు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తామని చెప్పారు. టేక్మాల్ మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి కృషి చేస్తామని తెలిపారు.మోహన్ నాయక్ ఎస్టీ మోర్చా ద్వారా గిరిజన ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, వడ్డే రాములు రైతులకు సంబంధించిన సమస్యలను పార్టీ వేదికల ద్వారా ప్రస్తావిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన బాధ్యతలు పొందిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా లేబర్ కన్వీనర్ నాయికోటి శామయ్య, ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు సిద్ధి రాములు, టేక్మల్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు శంకర్,బీజేవైఎం జిల్లా సెక్రెటరీ మదన్ రెడ్డి,మండల్ జనరల్ సెక్రెటరీ సేనపతి, జనరల్ సెక్రెటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## మిత్రుడి కుటుంబానికి అండగా.. రూ.లక్ష సాయం

**దశదిన కర్మ సందర్భంగా స్నేహితుల ఔదార్యం**

**పిల్లల భవిష్యత్ కోసం ఆర్థిక చేయూత**

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి**

ప్రజా వాయిస్,ఆత్మకూరు(యం):
ఆత్మీయ మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పాశం ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కర్మ సందర్భంగా మిత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.మిత్రుడి కుటుంబం కష్టకాలంలో ఉందని గుర్తించిన స్నేహితులు తమ వంతు సాయం అందించాలని నిర్ణయించుకున్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మిత్రులంతా కలిసి రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో పుట్ట శ్రీనివాస్, తవిటి వెంకటేశ్వర్లు, పలసం పాండు, పీసరి నర్సిరెడ్డి, మల్లికార్జున్, నరుకుడు బిందెల, బద్దం వెంకటరెడ్డి, బోనగిరి యాదగిరి, మామిడి శ్రీనివాస్‌రెడ్డి, యాస సురేందర్‌రెడ్డి, రచ్చ రాము, రంగ శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో కౌన్సిలర్ ఆది అజయ్ కుమార్‌ది ప్రత్యేక ముద్ర

**అద్రాస్‌పల్లిని దాటి.. మూడు చింతలపల్లి ప్రజలకు అండగా ఆది అజయ్ కుమార్**

**ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు**

మేడ్చల్, మూడు చింతలపల్లి / ప్రజా వాయిస్ :
అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన కౌన్సిలర్ ఆది అజయ్ కుమార్ ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. సేవలను కేవలం తన గ్రామానికే పరిమితం చేయకుండా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు.వ్యాపార రంగంలో రాణిస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న ఆది అజయ్ కుమార్.. తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి సేవ చేయాలనే సంకల్పంతో సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అద్రాస్‌పల్లి శివాలయ నిర్మాణంలో గ్రామస్తులతో కలిసి కృషి చేయడంతో పాటు యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన అనంతరం అద్రాస్‌పల్లి 22వ వార్డుకు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఆయన ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సేవలను కొనసాగిస్తున్నారు. గ్రామంలో అవసరమైన చిన్నచిన్న అభివృద్ధి పనులకు తన సొంత నిధులతో సహకరించడం, విద్యార్థులకు చదువు, ఉద్యోగ అవకాశాల విషయంలో అండగా నిలవడం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు, ఆడపిల్లల వివాహాల వంటి శుభకార్యాలకు తన వంతు సహాయం అందిస్తున్నారు. గ్రామం ఏదైనా.. సమస్య ఏదైనా.. తనను ఆశ్రయించిన వారికి సాధ్యమైనంత మేరకు సహాయం చేయడం ఆది అజయ్ కుమార్ ప్రత్యేకతగా నిలుస్తోంది. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఆపద సమయంలో సహాయం కోరితే వారి పరిస్థితిని తెలుసుకొని మానవతా దృక్పథంతో స్పందిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజలకు అందుబాటులో ఉండటం, యువతను ప్రోత్సహించడం, విద్యార్థులకు అండగా నిలవడం, నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వడం వంటి సేవా కార్యక్రమాలతో ఆది అజయ్ కుమార్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. పదవికి అతీతంగా ప్రజాసేవను కొనసాగిస్తున్న ఆయన సేవలు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.






## కోరుట్ల గణనాథుల పూజల్లో జువ్వాడి కృష్ణారావు

**ప్రజా వాయిస్, కోరుట్ల:**
కోరుట్ల పట్టణంలోని 23వ వార్డు (బెజ్జరపు భారద్వాజ్ ఆధ్వర్యంలో), టీచర్స్ క్లబ్ రోడ్డు (ఛాంపియన్స్ యూత్), జవహర్ రోడ్డు (వైశ్య సంఘం)లలో వెలసిన గణనాథులకు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌తో కలిసి పూజలు చేసిన అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎడ్ల రమేష్, చిట్టిమిల్లి రంజిత్ గుప్తా, ఎంబేరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





## గొర్రెల మందపై పిడుగుపాటు..

## 12 గొర్రెలు మృతి

**ప్రజా వాయిస్, కోరుట్ల:**
పిడుగుపాటుకు గురై 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం రామారావుపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జీవాల పెంపకందారుడు చిలువేరి మహేష్ తన గొర్రెల మందను మేత కోసం సమీప ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో గొర్రెల మందపై పిడుగు పడటంతో సుమారు 12 గొర్రెలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, తీవ్రంగా నష్టపోయిన తనకు ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు మహేష్ కన్నీరుమున్నీరయ్యాడు.



## అందోల్ లో మంత్రి పర్యటన

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**
ఈ పర్యటనలో...ఆందోల్ మండలంలోని డాకూర్ లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పర్యటన లో భాగంగా వట్పల్లి మండలం ఉసిరిక పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నే నర్సింలు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వర్ధంతి సందర్భంగా మంత్రి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం, ఉసిరిక గ్రామంలో అనారోగ్యం తో బాధ పడుతున్న మాజీ జెడ్పిటిసి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల రాంరెడ్డి గారిని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటన లో భాగంగా మార్వెల్లి గ్రామం లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. శ్రీ సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట పీసీసీ ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వాస్, మాజీ అధ్యక్షులు రమేష్ జోషి, ఆత్మ కమిటీ చైర్మన్ కచుర్ రావు, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, పార్టీ నియోజక వర్గ ముఖ్య నాయకులు శేరి జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, దిగంబర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అల్లదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషా రెడ్డి , పెద్దపట్ల వినయ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# బమ్మెరలో ఘనంగా పోతన జయంతి భాగవత ఉద్భవ సాహిత్య ఉత్సవాలు

**పోతన పద్యాలను యువతకు, భావితరాలకు చేరువ చేయాలి**

**పోతన స్మారక కేంద్రం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి**

**పోతన ఆనవాళ్ల పరిరక్షణకు కృషి చేయాలి. చింత ప్రసాద్**

**ప్రజా వాయిస్/ పాలకుర్తి/సెప్టెంబర్ 20**
పాలకుర్తి మండలం బొమ్మెర లో ఆదివారం రోజున సహజ కవి బమ్మెర పోతన జయంతిని బమ్మెర పోతన స్మారక కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పోతన రచించిన భాగవతం ద్వారా అందించిన సందేశం అందుకోని ముందుకు సాగితే ఆయనకు మనం అందించే ఘన నివాళి అని ముఖ్య అతిథిగా వచ్చిన కొత్త తెలంగాణ చరిత్రబృందం సభ్యులు,అర్చకులు కె.వి.జి.కె.ఆచార్య అన్నారు.ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న వ్యవస్థాపక అధ్యక్షులు సౌదామని సాహిత్య సంస్థ - కామారెడ్డి గూడెం చింత ప్రసాద్ , పోతన చరిత్రను నేటి తరానికి అందించాలి పోతన స్మారక కేంద్రాన్ని త్వరగా పూర్తి చేయాలి పోతన ఆనవాళ్లను పరిరక్షించుకోవాలని అన్నారు. రామాలయ పూజారి బట్టర్ రామాచార్యులు మాట్లాడుతూ పోతన వారసత్వాన్ని పరిరక్షించాలని ,పోతన పద్యాలను నేటి యువతకు,భావితరాలకు అందించేలా అడుగేయాలని పేర్కొన్నారు.వచ్చే సంవత్సరం ఘనంగా పోతన జయంతి నిర్వహిస్తామని,కవి సమ్మేళనం ఏర్పాటు చేసి పోతన వైభవం అందరికి తెలిసెలా ముందుకు సాగుతామని గ్రామ సర్పంచ్ రమ్య ప్రశాంత్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ పేర్కొన్నారు.మధురమైన పద్యాలను అందించిన పోతన గ్రామంలో మేము ఉండటం మా భాగ్యమని పోతన సాహిత్య కళావేదిక కార్యదర్శి దేవసాని ఉపేందర్, శ్రీ రామదాసు భజన మండలి మండల అధ్యక్షులు సోమ,సత్యం పేర్కొన్నారు.పోతన వైభవం అందరికి అందేలా ప్రభుత్వం పోతన జయంతిని అధికారికంగా నిర్వహించాలని పోతన సాహిత్యకళా వేదిక అధ్యక్షులు మాన్యపు భుజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామదాసు భజన మండలి సభ్యులు, వార్డు సభ్యులు వంగాల భాస్కర్, ఉపాధ్యాయుడు కొంగ సురేష్, యువ నాయకుడు ఉడుత నరేష్, ఉప్పలయ్య, కొమురయ్య, పెంతల బిక్షం, సోమ, నారాయణ, మారం వెంకన్న, అంజమ్మ, సోమేశ్వర్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరు



# లేఆఫ్‌ల నీడలో ఏఐ భవిష్యత్తు...ఒక క్లిక్‌తో ఉద్యోగం కట్!

**ఏఐ వేగం.. ఉద్యోగ భద్రతకు సవాలు**

**సాంకేతిక మార్పుతోపాటు మానవ భద్రతకూ ప్రాధాన్యం అవసరం**

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 20**
సాంకేతికత వేగం పెరుగుతున్న కొద్దీ ఉద్యోగ ప్రపంచం రూపం మారుతోంది. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ సంస్థలకు పనిని వేగంగా పూర్తి చేసే సామర్థ్యాన్ని ఇస్తున్నాయి. ఉత్పాదకత పెరుగుతోంది. ఖర్చులు తగ్గుతున్నాయి. అయితే ఇదే సమయంలో ఉద్యోగ భద్రతపై ఆందోళన కూడా పెరుగుతోంది. ఇటీవల అమెరికాకు చెందిన ఫిన్‌టెక్ సంస్థ బ్లూవైన్‌లో పనిచేస్తున్న భారతీయ కస్టమర్ సర్వీస్ ఉద్యోగులకు కొద్ది నిమిషాల ఆన్‌లైన్ సమావేశంలో లేఆఫ్ ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. సమావేశం అనంతరం వారి ఈమెయిల్, అంతర్గత వ్యవస్థల యాక్సెస్ నిలిపివేసినట్లు కూడా నివేదికలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై వ్యక్తమవుతున్న ఆందోళనకు కారణం ఉద్యోగాల కోత మాత్రమే కాదు.. దాని అమలు తీరులో కనిపిస్తున్న మానవీయత ప్రశ్న.

**లేఆఫ్ అనేది ఉద్యోగి తప్పిదానికి విధించే శిక్ష కాదు**
సంస్థ ఆర్థిక పరిస్థితులు, పునర్వ్యవస్థీకరణ, వ్యాపార వ్యూహంలో మార్పులు, సాంకేతిక పరిణామాలు లేదా ఒక విభాగం అవసరం తగ్గడం వంటి కారణాలతో ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం కూడా దాని పరిధిలోకి వస్తుంది. అంటే ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినప్పటికీ, సంస్థ నిర్ణయం వల్ల ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది.ఇక్కడే సమస్య తీవ్రత తెలుస్తుంది. ఒక సంస్థ తన వ్యాపార లెక్కలను మార్చుకోవచ్చు. కానీ ఉద్యోగి కుటుంబం తన జీవితాన్ని ఒక్కసారిగా మార్చుకోలేను. నెలవారీ జీతంపై ఆధారపడే కుటుంబానికి ఉద్యోగం కోల్పోవడం అంటే పిల్లల చదువు, గృహ రుణం, రోజువారీ ఖర్చులు, వైద్యం, భవిష్యత్ పొదుపు వంటి అనేక అంశాలపై ప్రభావం పడటం. ముఖ్యంగా మధ్యవయసులో ఉద్యోగం కోల్పోయిన వారికి పరిస్థితి మరింత క్లిష్టంగా ఉండవచ్చు కొత్త ఉద్యోగం కోసం పోటీ, మారుతున్న సాంకేతిక నైపుణ్యాల అవసరం, వయసుకు సంబంధించిన నియామక ధోరణులు వారికి అదనపు సవాళ్లుగా మారవచ్చు. అందువల్ల లేఆఫ్‌ను కేవలం సంస్థ అంతర్గత నిర్ణయంగా కాకుండా దాని సామాజిక ప్రభావంతో చూడాల్సిన అవసరం ఉంది.

**ఏఐ తెచ్చిన కొత్త ప్రశ్న**
కస్టమర్ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, కంటెంట్ తయారీ, కోడింగ్ వంటి రంగాల్లో ఏఐ ఇప్పటికే




అనేక పనులను వేగంగా నిర్వహిస్తోంది భవిష్యత్తులో ఈ సామర్థ్యం మరింత పెరగవచ్చు.అయితే ఏఐ వల్ల ఉద్యోగాలన్నీ మాయమవుతాయని చెప్పడం ఎంత అతిశయోక్తో, దాని ప్రభావాన్ని పూర్తిగా విస్మరించడం కూడా అంతే తప్పు. కొన్ని పనుల స్వరూపం మారవచ్చు. కొన్ని ఉద్యోగాలు తగ్గవచ్చు. అదే సమయంలో కొత్త నైపుణ్యాలు, కొత్త వృత్తులు, కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు. అందువల్ల అసలు ప్రశ్న ఏఐను అడ్డుకోవాలా అనే దానికంటే, ఏఐతో మారుతున్న ఉద్యోగ ప్రపంచానికి మనుషులను ఎలా సిద్ధం చేయాలి? అన్నదే.

**ఉత్పాదకత ప్రయోజనం ఎవరికి?**
సాంకేతికత ఒక ఉద్యోగి చేసే పనిని తక్కువ సమయంలో పూర్తి చేయగలిగితే దాని ప్రయోజనం సంస్థకే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పని భారం తగ్గించడం, నైపుణ్య శిక్షణ అందించడం, కొత్త బాధ్యతలకు సిద్ధం చేయడం, మెరుగైన వేతనాలు లేదా పని పరిస్థితులు కల్పించడం వంటి మార్గాల్లో ఉద్యోగికి కూడా ప్రయోజనం చేరవచ్చు. లేకపోతే సాంకేతిక పురోగతి ఒకవైపు ఉత్పాదకతను పెంచుతూనే మరోవైపు ఉద్యోగ అస్థిరతను పెంచే విరుద్ధ పరిస్థితి ఏర్పడుతుంది. కంపెనీలకు వ్యాపార నిర్ణయాలు తీసుకునే హక్కు ఉన్నట్లే, ఆ నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొనే ఉద్యోగులకు కూడా న్యాయమైన మార్పు ప్రక్రియ అవసరం.

**నైపుణ్య శిక్షణతోనే సమస్య తీరదు**
మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగులు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం అవసరం. కానీ ఉద్యోగం కోల్పోయిన వ్యక్తికి 'కొత్త కోర్సు నేర్చుకోండి' అని చెప్పడం మాత్రమే సరిపోదు. శిక్షణ కాలంలో కుటుంబాన్ని ఎలా పోషించాలి? కొత్త ఉద్యోగం దొరికే వరకు ఆదాయం ఎలా సమకూరాలి? ఆరోగ్య బీమా, ఈఎంఐలు, పిల్లల చదువులు వంటి బాధ్యతలను ఎలా నిర్వహించాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వ్యవస్థ కూడా ఉండాలి. పునరుద్యోగ సహాయం, నైపుణ్య శిక్షణ, తగిన నోటీసు, పరిహారం, సామాజిక భద్రత వంటి అంశాలు భవిష్యత్ ఉపాధి విధానంలో కీలకంగా మారాల్సిన అవసరం ఉంది.

**భారత్ ముందున్న బాధ్యత**
భారత్ వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశంలో ఏఐ విస్తరణ ఒకేసారి అవకాశం కూడా, సవాలు కూడా ప్రపంచ మార్కెట్‌లో పోటీకి అవసరమైన సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవడంతోపాటు, ఆ మార్పు వల్ల ప్రభావితమయ్యే ఉద్యోగులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం. సాంకేతికతను ఆపడం సాధ్యం కాదు. దాన్ని నిరాకరించడం ప్రయోజనం లేని పని. కానీ సాంకేతిక పరిణామం వేగానికి అనుగుణంగా ఉద్యోగ విధానాలు, శిక్షణా వ్యవస్థలు, సామాజిక భద్రతా చర్యలు కూడా మారాలి. అభివృద్ధి అంటే యంత్రాలు మరింత వేగంగా పనిచేయడం మాత్రమే కాదు. ఆ వేగం వల్ల మనుషుల జీవితం కూడా మెరుగుపడాలి. కంపెనీల ఉత్పాదకత పెరగడం ఆర్థికంగా అవసరం. అదే సమయంలో ఉద్యోగుల జీవన భద్రతను కాపాడటం సామాజికంగా అవసరం. ఏఐ మనిషి స్థానాన్ని భర్తీ చేసే సాధనంగా కాకుండా.. మనిషి సామర్థ్యాన్ని పెంచే సాధనంగా మారినప్పుడే సాంకేతిక పురోగతికి నిజమైన అర్థం ఉంటుంది.సాంకేతికత భవిష్యత్తును మార్చడం ఖాయం. ఆ భవిష్యత్తులో మనిషి స్థానం ఏమిటన్నదే ఇప్పుడు నిర్ణయించాల్సిన ప్రశ్న

**ముగింపు**
ఏఐ విస్తరణతో ఉద్యోగాల స్వరూపం మారడం అనివార్యం. కొన్ని పనులు యంత్రాలకు అప్పగించబడినా, కొత్త అవకాశాలు కూడా పుట్టుకొస్తాయి. ఈ మార్పును అడ్డుకోవడం పరిష్కారం కాదు; అయితే ఉద్యోగ భద్రతను పూర్తిగా మార్కెట్ నిర్ణయాలకు వదిలేయడం కూడా సమంజసం కాదు. ఉద్యోగం కంపెనీ ఖర్చుల పట్టికలోని సంఖ్య మాత్రమే కాదు అది ఒక కుటుంబానికి జీవనాధారం. అందువల్ల సాంకేతిక మార్పుతోపాటు పునఃశిక్షణ, పునరుద్యోగం, తగిన నోటీసు, పరిహారం, సామాజిక భద్రత వంటి రక్షణలు తప్పనిసరిగా ఉండాలి. సంస్థలు ఏఐని స్వీకరించే బాధ్యతతోపాటు ఉద్యోగులను ఆ మార్పుకు సిద్ధం చేసే బాధ్యతను కూడా తీసుకోవాలి. ప్రభుత్వాలు అందుకు అనుగుణమైన విధానాలను రూపొందించాలి. సాంకేతిక పురోగతి నిజమైన విజయంగా నిలవాలంటే అది ఉత్పాదకతను మాత్రమే కాదు, మనుషుల జీవన భద్రతను కూడా పెంచాలి. ఏఐ భవిష్యత్తు కొద్దిమందికి లాభం చేకూర్చేదిగా కాకుండా, సమాజమంతటికీ అవకాశాలు మరియు భద్రత అందించేదిగా ఉండాలి.

# డిసిసి అధ్యక్షులుగా మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికే

**- ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోంత తమ్ముడికి పదవి**
**- డిసిసి అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి**

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**
కాంగ్రెస్ పార్టీలో మరోసారి తమ ఆధిపత్యాన్ని రెడ్డి సామాజిక వర్గం చాటుకుంటుంది. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులుగా టీపీసీ పార్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుమారుడు బరత్ రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. తాజాగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిని నియమిస్తూ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్య పోరు సాగుతుందని చెప్పవచ్చు. మిగతా ఎస్సి, ఎస్టీ బీసీ సామాజిక వర్గాల చెందిన అగ్ర నాయకులు రాష్ట్రస్థాయిలో క్రేశీలక పాత్ర పోషిస్తున్న వారికి మాత్రం పదవులు తగ్గడం లేదు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత ఆరు సంవత్సరాలుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు పదవి రెడ్డి సామాజిక వర్గాలు చెందిన వారికే అవకాశం ఇస్తూ వస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతో ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న తరుణంలో తిరిగి అది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వడం పట్ల సొంత పార్టీ నాయకులే తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఏమైనాప్పటికీ పార్టీలో అగ్రవర్ణాలదే అధిపత్య పోరు కొనసాగుతుందని చెప్పేందుకు ఇదే నిదర్శనం. సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నారాయణ ఖేడ్ కు చెందిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ని నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసిసి అధ్యక్ష పదవికి జిల్లాలో పలువురు ప్రముఖ నాయకులు పోటీపడ్డ చివరికి మారుమూల ప్రాంతమైన ఖేడ్ కు చెందిన చంద్రశేఖర్ రెడ్డికి పదవి వరించింది. 1990 నుంచి 1992 వరకు జేఎన్టీయూ విశ్వవిద్యాలయంలో ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘ నాయకునిగా, 1996- 1999 వరకు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2000- 2005 వరకు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షునిగా, 2008- 2014 వరకు డిసిసి కార్యదర్శిగా, 2015- 2025 వరకు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కృష్ణారెడ్డి కుమారుడైన ఈయన ప్రస్తుత ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డికి స్వయాన సోదరుడు. కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్న మారుమూల ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి కి పదవి వివరించడం పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానాలకు
# జననేత దండు సారయ్య ఆర్థిక సహాయాలు

**పలువార్డుల్లో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య**

**ప్రజావాయిస్, ఇల్లందు(సెప్టెంబర్20):** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇల్లందు పట్టణంలోని పలువార్డుల్లో ఆదివారం నిర్వహించిన నవరాత్రి వేడుకలు, అన్నదాన కార్యక్రమాల్లో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి 24 క్రాఫ్స్ యూనియన్ ఆధ్వర్యంలో 16వ వార్డులో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో దండు సారయ్య పాల్గొని విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్నదాన





కార్యక్రమానికి దాతగా వ్యవహరించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. అదేవిధంగా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 5, 12, 13, 15, 16, 18, 21, 22వ వార్డుల్లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందిస్తూ అన్నదాన



కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తున్న దండు సారయ్యను పలువురు అభినందించారు. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డాన్స్ మాస్టర్స్ అండ్ డాన్సర్స్ కడారి వెంకటేష్, శ్రీకాంత్, శేఖర్, సాయి, కళ్యాణ్, కార్తీక్, దీపక్, రవితేజ, జననేత దండు సారయ్య అనుచరులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులో కొలువుదీరిన గణనాథులను
# దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్

**ప్రజావాయిస్, ఇల్లందు(సెప్టెంబర్20):** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 13, 14, 18, 21వార్డులలో కొలువుతీరిన గణనాథులను ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్, 13వ వార్డు కౌన్సిలర్, జననేత దండు సారయ్యలతో కలిసి మండపాల్లో వినాయకులకు ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గణపతి మండపాల ఉత్సవకమిటీ సభ్యులు, స్థానిక వార్డుప్రజలు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, జనాకర్షక నేత దండు సారయ్యలకు శాలువాలతో



సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యురాలు హరిప్రియ నాయక్ మాట్లాడుతూ..గణనాధుని సేవలో ఈనవరాత్రులు విశిష్టసేవలు చేస్తున్న ఆయా వార్డుప్రజలందరికీ వినాయక నవరాత్రి ఉత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ కులమతాలకతీతంగా సామరస్యంతో, వార్డు ప్రజలందరి సహకారంతో నిర్వహిస్తున్న ఉత్సవ



కమిటీసభ్యులందరినీ అభినందించారు. అదేవిధంగా 9రోజుల పూజాకార్యక్రమాల అనంతరం నిర్వహించే నిమజ్జన ఏర్పాట్లలో కూడా తగుజాగ్రత్తల నడుమ నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ముగించుకోవాలని ఆకాంక్షించారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న
# నిరుపేదకు చెలిమి ఫౌండేషన్ చేయూత

**89వ సహాయ కార్యక్రమంలో బాలరాజుగౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం**

**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :**
బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ చేయూత అందించింది. ఫౌండేషన్ 89వ సహాయ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ మండలం సింగాటం గ్రామానికి చెందిన కీసర బాలరాజుగౌడ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బాలరాజుగౌడ్ రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అనారోగ్యంతో అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో వైద్య చికిత్సకు భారీగా ఖర్చు కావడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రస్తుతం గజ్వేల్‌లోని పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. బాలరాజుగౌడ్ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను రమేష్‌గౌడ్ చెలిమి ఫౌండేషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఫౌండేషన్ సభ్యులు బాలరాజుగౌడ్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుసగా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్,




ఉపాధ్యక్షుడు నాగపూరి రమేష్, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి దొంతుల ఆనంద్, కార్యదర్శి చేపూరి సంతోష్, గుర్రం తులసీదాస్, పెద్దూరి శ్రీనివాస్, టెంటు నర్సింలు, యాట ఆంజనేయులు, కొండాపురం యాదగిరి, డాక్టర్ రహీమ్, నాగపూరి బాబు, చాడ విష్ణువర్ధన్‌రెడ్డి, విశ్వనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే చట్టాలు వస్తాయి...ప్రజా సమస్యలు
## పరిష్కారమవుతాయి: సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం)మండలంలోని లోలెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై సిపిఐ పాదయాత్ర**

**ప్రజా వాయిస్/ఆత్మకూర్(ఎం):**
ప్రజా పోరాటాలతోనే చట్టాలు వస్తాయని,ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని,చట్టాల అమలుకు పోరాటాలు చేయవలసి వస్తుందని,మాజీ శాసనసభ్యులు సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు,మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం ఆధ్వర్యంలో లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై చేపట్టిన రెండు రోజుల పాదయాత్రను రాయిపల్లిలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశామని,ప్రజా సమస్యలు,రైతాంగ సమస్యలు,వ్యవసాయ కూలీల సమస్యలు,సంఘటిత,అసంఘటిత కార్మిక సమస్యల పైన ఉద్యమాలు చేపడుతున్నామని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలలో సిపిఐ ఎప్పుడూ ముందుంటుందని, మండలంలోని లో లెవెల్ బ్రిడ్జిలు రాయిపల్లి కాలువపల్లి, ఆత్మకూరుబిమొరిపిరాల,ఆత్మకూరుబికొరటికల్,రహీంఖాన్ పేట పోతిరెడ్డిపల్లి,సారగండ్ల గూడెంబిపారుపల్లి,రాఘవాపురంబి కూరెళ్ళ, కూరెళ్ళబిపల్లెర్ల గ్రామాల మధ్యలో,లింగరాజు పల్లిబివలిగొండ హైవే రోడ్డు మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేస్తామనిఅన్నారు.పాదయాత్రలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం,నయీమ్,గుర్రం రాజమణి,జక్క దయాకర్ రెడ్డి,బొబ్బల లాల్ రెడ్డి,అంబోజు రాములు,జల్ది రాములు,మజ్జిగ నరసయ్య,కల్వల నరసయ్య,మారుపాక అంజయ్య,సోలిపురం లింగారెడ్డి,గాజుల సిద్ధులు, పాదయాత్రలో పాల్గొనగా జిల్లా కార్యదర్శి యానాల



దామోదర్ రెడ్డి,సహాయ కార్యదర్శిలు బోలగాని సత్యనారాయణ,చేడే చంద్రయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్,చెక్క వెంకటేష్ , కళ్లెం కృష్ణ,కుసుమని హరిచంద్ర, పేర బోయిన మహేందర్, బండి జంగమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్,తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు ఖుషి పాక నరసింహ, కలకొండ సంజీవ,గణేష్ , కట్ల యాదగిరి, మోత్కూర్,మోటకొండూర్ కార్యదర్శులు అన్నెపు వెంకటేష్,గాదగాని మాణిక్యం పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. వివిధ గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# బాక్సింగ్ ఎంపికల్లో మెరిసిన కాగజ్‌నగర్ క్రీడాకారులు

**జిల్లా స్థాయి బాక్సింగ్ సెలక్షన్లు విజయవంతం**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ సిరిసిల్క్ ఎఫ్ కాలనీలోని ముత్తు బాక్సింగ్ క్లబ్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు విజయవంతంగా జరిగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. మధు, చైర్మన్ శివకుమార్ నాయర్, వైస్ ప్రెసిడెంట్ మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు ఎస్ఐలు యాదవ్ గిరి, రమణ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను అభినందించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎ.వి. రామ్మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. శేఖర్ యాదవ్ మరియు కోచ్‌లు గిరి, శివానంద్, సాయి కుమార్ తదితరులు ఎంపికలను నిర్వహించారు.



# కళాకారులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించాలి

**ఉద్యమ కళాకారుల డిమాండ్**

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కాగజ్‌నగర్ మండలం లో ఉద్యమ నిరుద్యోగ కళాకారులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఉద్యోగాలు ప్రకటించలేదని కొమరం భీమ్ జిల్లా కళాకారులు మండిపడ్డారు. శాసనసభలో కళాకారుల ఉద్యోగాల విషయంలో హామీ ఇచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే మేనిఫెస్టోలోని జీవో ప్రకారం ఉద్యోగాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రవీంద్రభారతిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు డోంగ్రి సంతోష్, జిల్లా అధ్యక్షుడు మేడి కార్తీక్, రామిళ్ల రమేష్, దుర్గం సమ్మక్క, గాథమళ్ళ మౌనిక తదితరులు పాల్గొన్నారు.







# వినోబానగర్ లో విషాదం

**కారు డోర్ లాక్ అయ్యి చిన్నారి మృతి**

**కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**జూలూరుపాడు, ప్రజా వాయిస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలోని వినోబానగర్ గ్రామంలో ఆదివారం విషాద ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ దంపతుల ముద్దుల కూతురు తన్వి శ్రీ (5) సంవత్సరాల పాప కారు ఎక్కి ఆడుకుంటూ ప్రమాదవశాత్ డోర్ లాక్ అవడంతో ఊపిరాడక చనిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు తన్వి శ్రీని ఆసుపత్రికి తరలించగా అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గంగావత్ నవీన్ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగింది. ఈ సంఘటనతో వినోబా నగర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హుటా హుటిన నవీన్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. మండలానికి చెందిన పలు పార్టీల ముఖ్య నాయకులు నవీన్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి సానుభూతిని తెలిపారు.

# ఇదేంటి ‘సర్’?..అద్వానీ, జైశంకర్ సహా ప్రముఖులకు నోటీసులు

**ఢిల్లీ ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రముఖుల వివరాలపై అభ్యంతరాలు**

**సుమారు 33 లక్షల మందికి నోటీసులు.. నోటీసు అంటే ఓటు హక్కు రద్దు కాదని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 :**
ఢిల్లీలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పలువురు ప్రముఖుల పేర్లు నోటీసుల జాబితాలోకి వచ్చాయి. మాజీ ఉప ప్రధానమంత్రి ఎల్.కే. అద్వానీ, కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తదితరుల ఓటరు వివరాల్లో వ్యత్యాసాలు లేదా గత జాబితాలతో అనుసంధానం కాకపోవడంతో నోటీసులు జారీ అయినట్లు నివేదికలు వెల్లడించాయి.అద్వానీ, ఆయన కుటుంబ సభ్యుల్లో కొందరి పేర్లు 2002 నాటి ఓటరు జాబితాతో అనుసంధానం కాలేదనే కారణంతో నోటీసుల జాబితాలో ఉన్నట్లు సమాచారం. జైశంకర్, ఆయన భార్య వివరాలు కూడా పరిశీలనకు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఎన్నికల కమిషనర్ సంధు పేరులోని అక్షరాల విషయంలో రికార్డుల్లో వ్యత్యాసం గుర్తించినట్లు, విక్రమ్ మిస్రీ పేరు కూడా నోటీసుల జాబితాలో ఉన్నట్లు వెల్లడైంది.ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యుల పేర్లు కూడా ఇదే ప్రక్రియలో నోటీసుల జాబితాలోకి వచ్చాయి. రేఖా గుప్తా వివరాల్లో వయస్సుకు సంబంధించిన వ్యత్యాసంపై నోటీసు జారీ కాగా, అవసరమైన పత్రాల పరిశీలన అనంతరం ఆమె వివరాలు ధ్రువీకరించినట్లు ఢిల్లీ ఎన్నికల అధికారులు తెలిపారు. కేజ్రీవాల్ కుటుంబ సభ్యుల వివరాలు గత సవరణ జాబితాతో అనుసంధానం కాకపోవడంతో నోటీసులు జారీ అయినట్లు నివేదికలు పేర్కొన్నాయి.ఢిల్లీ ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణలో సుమారు 33 లక్షల మందికి వివరాల ధ్రువీకరణ కోసం నోటీసులు జారీ చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. గత జాబితాతో వివరాలు అనుసంధానం కాకపోవడం, పేరు లేదా ఇతర వివరాల్లో వ్యత్యాసాలు కనిపించడం వంటి కారణాలతో ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.అయితే నోటీసు అందుకోవడం అంటే ఓటు హక్కు తక్షణమే రద్దయినట్లు కాదని ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం స్పష్టం చేసింది. సంబంధిత ఓటర్లు అవసరమైన పత్రాలు, వివరణలు సమర్పించిన అనంతరం వారి అర్హతను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ అంశంపై



సుప్రీంకోర్టు సెప్టెంబర్ 22న విచారణ చేపట్టనున్నట్లు నివేదికలు వెల్లడించాయి.ఢిల్లీ ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రముఖులు కూడా నోటీసులు అందుకున్న నేపథ్యంలో ప్రక్రియపై రాజకీయ, ప్రజాస్వామ్య పరంగా చర్చ పెరిగింది. అయితే ప్రతి నోటీసుకు సంబంధించిన కారణం, సంబంధిత ఓటరు సమర్పించే పత్రాలు, ఎన్నికల అధికారుల పరిశీలన ఆధారంగానే తుది అర్హత నిర్ణయించబడుతుంది.



# బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే భరోసా..

**ప్రజా వాయిస్,పాపన్నపేట.**
పాపన్నపేట మండల పరిధిలోని తమ్మాయిపల్లి, మిన్పూర్ గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఆదివారం నాడు పరామర్శించారు. తమ్మాయిపల్లి సర్పంచ్ సక్రు నాయక్ భార్య రుక్కి బాయి మృతి దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మిన్ పూర్ లో మృతి చెందిన కర్రోళ్ల హనుమయ్య కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట పలువురు పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

# బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందే: కల్వకుంట్ల కవిత

**కోస్గి పాంచజన్య సంకల్ప సభలో ప్రభుత్వంపై విమర్శలు**

**ఉచిత విద్య, వైద్యం.. యువతకు ఉపాధి, రైతులకు సాగునీరు తమ ప్రధాన లక్ష్యాలని ప్రకటన**

**కోస్గి, సెప్టెంబర్ 20:**
బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. తెలంగాణ రక్షణ సేన తన వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా తెలంగాణ ప్రజల కోసం ఏర్పాటైందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి, రైతులకు సాగునీరు, వ్యవసాయానికి అవసరమైన వనరులు అందించడమే తమ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.తాను కాంగ్రెస్ లేదా భారతీయ జనతా పార్టీకి చెందిన బాణం కాదని, బహుజనుల కోసం పోరాడే బాణమని కవిత వ్యాఖ్యానించారు. అంబేద్కర్ ఆలోచనలు, పూలే సిద్ధాంతాలు, సావిత్రీబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమన్నారు. ప్రజల మద్దతు ఉంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాజకీయంగా పోరాడతానని చెప్పారు. ఎవరి అండ లేకుండానే మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని పేర్కొన్నారు.తెలంగాణలో యువతకు ఉద్యోగాలు, ప్రజలకు విద్యా–వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదని కవిత విమర్శించారు. ప్రతి గ్రామానికి ఒక పాఠశాల, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు ఉచిత విద్య, ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు. విద్య, వైద్యం కోసం అవసరమైతే భారీగా నిధులు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.యువత వ్యాపార ఆలోచనలను ప్రోత్సహిస్తామని కవిత తెలిపారు. వారి వ్యాపార ప్రణాళికలను పరిశీలించి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత సామర్థ్యంపై నమ్మకం ఉంచాలని సూచించారు.పాలమూరు ప్రాంత సాగునీటి సమస్యపై కూడా కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కృష్ణా, తుంగభద్ర, కాగ్నా నదులు ఉన్నప్పటికీ మహబూబ్‌నగర్ ప్రాంతానికి సరిపడా సాగునీరు అందడం లేదని ఆరోపించారు. జూరాల నుంచి నీటిని తీసుకుని పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. రైతులు నీరు, ఎరువులు, విద్యుత్, రైతు భరోసా, మద్దతు ధర కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు.సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని కవిత అన్నారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ముదిరాజులు, ముస్లింలు, నేతన్నలు, గీత కార్మికులు, దళితులు, గిరిజనులు, మహిళలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ రక్షణ సేన ప్రకటించిన ‘పాంచజన్యం’లో ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం అనే ఐదు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వెల్లడించింది. కొడంగల్ వేదికగా ఈ అంశాలను ప్రజల ముందుంచిన కవిత.. పార్టీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను కొనసాగిస్తామని ప్రకటించారు.





# గడ్డం రామ నరసయ్య కు ‘సిపిఎం’ ఘన నివాళి

**50 కిలోల బియ్యం..**

**రూ 5000 లు ఆర్థిక సహాయం**

**ప్రజా వాయిస్/ఆత్మకూరు (ఎం);** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం కూరెళ్ళ గ్రామానికి చెందిన యక్షగానం కళాకారుడు గడ్డం రామనర్సయ్య మృతికి సిపిఎం గ్రామ శాఖ తరపున సంతాపాన్ని ప్రకటించి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబ సభ్యులు గడ్డం పాండురంగానికి శాఖ తరపున రూ 5000లు,ఉప సర్పంచ్ హన్మంతుల రమేష్ 50 కిలోల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, సంగీత డైరెక్టర్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దూరి ఐలయ్య, దేశపాక రవి, సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం, శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, గ్రామ ఉపసర్పంచ్ అన్మంతుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ మరిపల్లి మల్లయ్య,భాషబోయిన బుగ్గయ్య,బండ బీరయ్య, కూరెళ్ళ నాగయ్య,మారుపాక యాదయ్య,నార్కట్ పల్లి మల్లయ్య, బాషబోయిన ఐలయ్య,వనం బక్కమ్మ, నార్కట్ పల్లి లక్ష్మి , ప్రజానాట్యమండలి కళాకారులు గుండ నర్సింహ,పండుగు రాజమల్లు, మేడి పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కనెక్షన్ ఎప్పుడొస్తుంది? ఆరు నెలలుగా ఎదురుచూపులే!’’

**ఏపీ, తెలంగాణలో కొత్త కనెక్షన్ల కోసం వినియోగదారుల ఎదురుచూపులు**

**ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నా స్పష్టత లేదని ఆవేదన.. అధిక ధరలకు సిలిండర్లు కొనుగోలు చేస్తున్నామని వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 :**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్త గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది వినియోగదారులు నెలల తరబడి ఎదురుచూస్తున్నట్లు వాపోతున్నారు. ముఖ్యంగా కొత్తగా కాపురం ఏర్పాటు చేసుకున్న కుటుంబాలు, ఉపాధి కోసం గ్రామాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన వారు గ్యాస్ కనెక్షన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో సుమారు ఆరు నెలల క్రితం కొత్త గ్యాస్ కనెక్షన్ల జారీ ప్రక్రియ నిలిచిపోయిందని వినియోగదారులు పేర్కొంటున్నారు. పరిస్థితులు మారుతున్నప్పటికీ కొత్త కనెక్షన్ల జారీ పూర్తిస్థాయిలో పునరుద్ధరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ అంశంపై సంబంధిత గ్యాస్ సంస్థల నుంచి స్పష్టమైన అధికారిక సమాచారం అందాల్సి ఉంది.కొత్తగా అద్దె ఇళ్లలోకి మారిన కుటుంబాలు, ఇటీవల వివాహం చేసుకుని సంసారం ప్రారంభించిన జంటలు గ్యాస్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. వంట అవసరాలకు గ్యాస్ తప్పనిసరి కావడంతో కనెక్షన్ అందకపోవడం తమ రోజువారీ జీవితంపై ప్రభావం చూపుతోందని వారు అంటున్నారు.కనెక్షన్ కోసం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి వివరాలు అడుగుతున్నప్పటికీ ఎప్పుడు కొత్త కనెక్షన్ల జారీ ప్రారంభమవుతుందనే దానిపై స్పష్టత లభించడం లేదని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. దీంతో తమ దరఖాస్తుల పరిస్థితి ఏమిటో తెలియక అయోమయానికి గురవుతున్నామని పేర్కొంటున్నారు.కొత్త కనెక్షన్ అందుబాటులో లేకపోవడంతో కొందరు అవసరాల కోసం బయట నుంచి సిలిండర్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. సాధారణ ధర కంటే అధిక మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుండటంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటోందని పేర్కొంటున్నారు.నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులకు త్వరగా కొత్త గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. కొత్త కనెక్షన్ల జారీపై ఉన్న పరిస్థితిని సంబంధిత సంస్థలు స్పష్టంగా వెల్లడించాలని, ఏజెన్సీల వద్ద దరఖాస్తుదారులకు సరైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







# శ్రీ శివసాయి కాలనీలో గణనాథుడికి ప్రత్యేక పూజలు

**బొజ్జ గణపయ్యను దర్శించుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత రగడంపల్లి శ్రవణ్,నందిగామ నర్సింహ,పోతురాజు రామకృష్ణ**

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:**
సర్కిల్ పరిధి బుద్వేల్ శ్రీ శివసాయి కాలనీలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యను కాంగ్రెస్ సీనియర్ నేత రగడంపల్లి శ్రవణ్,టీచర్స్ కాలనీ అధ్యక్షుడు నందిగామ నర్సింహ,గండిపేట మండల టీయూడబ్ల్యూజే(ఐజేయు) యూనియన్ కార్యనిర్వహణ కార్యదర్శి, అరుంధతి సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, పోతురాజు రామకృష్ణ, భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.వినాయక చవితి ఉత్సవాల అధ్యక్షుడు చిలుకూరి ఇంద్రసేన రెడ్డి,గోపాల్‌రెడ్డి ఆహ్వానం మేరకు వారు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నిర్వాహకులు అతిథులను శాలువాలతో సత్కరించారు.అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రగడంపల్లి శ్రవణ్ మాట్లాడుతూ. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.కాలనీలో ప్రజలందరూ ఐకమత్యంతో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు.

# అంత్యక్రియల తేదీకి ఏఐ సలహా.. ఆ తర్వాత కంపెనీపై కేసు!

**చాట్‌బాట్ సూచించిన ముహూర్తంతో తల్లి అంత్యక్రియలు**

**కుటుంబంలో దురదృష్టకర ఘటన**

**తర్వాత ఏఐ కంపెనీపై చట్టపరమైన చర్యలకు వ్యక్తి ప్రయత్నం**

**జియాషాన్, సెప్టెంబర్ 20 :**
కృత్రిమ మేధ వినియోగం రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌లో ఆసక్తికర ఘటన వెలుగుచూసింది. జియాషాన్ కౌంటీకి చెందిన ‘షీ’ అనే వ్యక్తి తన తల్లి అంత్యక్రియలకు శుభ ముహూర్తం ఎంచుకునేందుకు ఏఐ చాట్‌బాట్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. చాట్‌బాట్ సూచించిన తేదీని అనుసరించి అంత్యక్రియలు నిర్వహించినట్లు కథనం పేర్కొంది.చైనా సంప్రదాయాల్లో వివాహాలు, అంత్యక్రియలు వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు శుభ ముహూర్తాలను ఎంచుకోవడం ఆనవాయితీగా ఉంది. ఈ నేపథ్యంలో షీ కూడా ఏఐ సూచనను పరిగణనలోకి తీసుకున్నాడు. అయితే అంత్యక్రియల అనంతరం తన కుటుంబంలో ఓ దురదృష్టకర ఘటన చోటుచేసుకోవడంతో, ఏఐ ఇచ్చిన తేదీ తప్పుగా ఉందని ఆరోపిస్తూ సంబంధిత సంస్థపై చట్టపరమైన చర్యలకు దిగినట్లు సమాచారం.అయితే ఏఐ సూచించిన తేదీకి, ఆ తర్వాత కుటుంబంలో చోటుచేసుకున్న ఘటనకు ప్రత్యక్ష సంబంధం ఉందని నిరూపించే శాస్త్రీయ ఆధారాలు లేవని నివేదికలు పేర్కొంటున్నాయి. అందువల్ల ఏఐ సలహానే ఆ ఘటనకు కారణమని నిర్ధారించలేమని స్పష్టమవుతోంది.ఈ ఘటనలో మరో ఆసక్తికరమైన అంశం కూడా ఉంది. ఏఐ సంస్థపై చర్యలు తీసుకునేందుకు అవసరమైన న్యాయపరమైన పత్రాలు, దరఖాస్తులను సిద్ధం చేసుకోవడంలో కూడా షీ అదే ఏఐ సాంకేతికతను ఉపయోగించినట్లు కథనం తెలిపింది. ఒకవైపు ఏఐ సలహా వల్ల నష్టం జరిగిందని ఆరోపిస్తూనే, మరోవైపు న్యాయపరమైన ప్రక్రియలో అదే సాంకేతికతను ఉపయోగించడం చర్చనీయాంశంగా మారింది.ఈ ఘటన ఏఐ ఆధారిత చాట్‌బాట్‌లను ఉపయోగించే విషయంలో జాగ్రత్త అవసరాన్ని మరోసారి తెరపైకి తెచ్చింది. ముఖ్యమైన వ్యక్తిగత, వైద్య, ఆర్థిక, న్యాయపరమైన లేదా సంప్రదాయ నిర్ణయాల్లో ఏఐ ఇచ్చే సమాచారాన్ని తుది నిర్ణయంగా పరిగణించకుండా, సంబంధిత నిపుణుల సలహాను కూడా తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

